మీ గళం..మా కళం...

# నమస్తే హైదరాబాద్

NAMASTHE HYDERABAD

తెలుగు దిన పత్రిక

RNI No: APTEL/2012/45237

| రంగారెడ్డి | సోమవారం | 08-12-2025 | సంపుటి : 14 | సంచిక :182 | పేజీలు :8 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|
| RangaReddy | Monday | 08-12-2025 | Volume :14 | Issue:182 | Pages:8 | Cost : 3 |


విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాధరణ పొందుతున్న నమస్తే హైదరాబాద్ తెలుగు దిన పత్రికకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం

Ph: 9912580066

# గోవాలో అగ్నిప్రమాదం

## - సిలిండర్ పేలి 25మంది మృతి



గోవాలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఓ నైట్ క్లబ్‌లో సిలిండర్ పేలి 25 మంది మృతి చెందారు. అనేక మంది గాయపడ్డారు. ప్రమాదానికి గురైన నైట్ క్లబ్‌ను గోవా సీఎం ప్రమోద్ సావంత్ పరిశీలించారు. మరోవైపు ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉత్తర గోవాలోని అర్పోరా గ్రామంలో ఉన్న 'బర్చ్ బై రోమియో లేన్' నైట్ క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. నైట్‌క్లబ్‌ను చెక్కతో నిర్మించడం వల్ల సిలిండర్ పేలడం వల్ల అగ్నికీలలు వేగంగా వ్యాపించాయి. దీంతో 25 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం గురించి తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. అతికష్టం మీద మంటలను అదుపు చేశారు. రాత్రంతా సహాయక చర్యలు కొనసాగాయి. నలుగురు పర్యటకులు కాగా, 14 మంది సిబ్బంది ఉన్నట్లు ప్రాథమిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. మిగిలిన వారి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. సిలిండర్ పేలడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు. బాధితులను గుర్తించి, వారి కుటుంబాలకు సమాచారం ఇచ్చేందుకు అధికారులు ప్రయత్నాలు చేపట్టారు. క్లబ్‌ను సీజ్ చేసి నిర్వాహకులను ప్రశ్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు. క్లబ్‌లో భద్రతా చర్యలకు సంబంధించి దర్యాప్తు జరుపుతామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదం జరిగిన నైట్‌క్లబ్ రాజధాని పనాజీకి 25 కి.మీ దూరంలో ఉంది. గతేడాది దీన్ని ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీఎం

2లో

## వెల్‌కమ్ టు

# గ్లోబల్ సమ్మిట్

**హైదరాబాద్, డిసెంబర్ 07 (నమస్తే హైదరాబాద్) :** సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ప్రతిష్ఠాత్మక 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు హైదరాబాద్ నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఫ్యూచర్ సిటీ వేదికగా జరిగే ఈ సదస్సు కోసం దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు తరలివస్తుండటంతో నగరం ఆధునిక హంగులను సంతరించుకుంది. ఈ కీలక తరుణంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా ప్రజలకు హృదయపూర్వక సందేశాన్ని అందించారు. తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని వివరిస్తూ, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టతనిచ్చారు.

"జాతి కోసం... జనహితం కోసం... గొప్ప కలలు కనాలంటే ధైర్యం ఉండాలి... గొప్ప కార్యాలు చేయాలంటే మహా సంకల్పం కావాలి'' అంటూ తన సందేశాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి, గత రెండేళ్లుగా అహర్నిశలు శ్రమించి తెలంగాణను ప్రగతి శిఖరాలపై నిలబెట్టేందుకు

2లో




- హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధం
- యువతకు కొలువులు, రైతులకు దన్ను, మహిళలకు భరోసా ఇచ్చామన్న ముఖ్యమంత్రి
- తెలంగాణను దేశ గ్రోత్ ఇంజిన్‌గా మార్చడమే లక్ష్యమని స్పష్టీకరణ
- గ్లోబల్ సమ్మిట్ తర్వాత తెలంగాణలో కొత్త లెక్క మొదలవుతుందని వ్యాఖ్య

**నిన్నటి వరకు ఒక లెక్క... రేపటి గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క: సీఎం రేవంత్ రెడ్డి**

# ప్రధాని మోదీకి

## పాకిస్తానీ మహిళ విజ్ఞప్తి



పాకిస్తాన్‌కు చెందిన నిఖిత నాగ్దేవ్ మహిళ.. తన భర్త విక్రమ్ నాగ్దేవ్ మోసం చేశాడని ఆరోపిస్తూ.. తనకు న్యాయం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేసింది. 2020లో పాకిస్తాన్‌లో హిందూ సంప్రదాయాల ప్రకారం విక్రమ్ తనను వివాహం చేసుకున్నాడని.. ఆ తర్వాత తనను భారత్‌కు తీసుకువచ్చినట్లు తెలిపింది. ఆ తర్వాత వీసా సమస్యల పేరుతో తిరిగి కరాచీకి పంపించాడని.. అప్పటి నుంచి మళ్లీ తీసుకెళ్లలేదని పేర్కొంది. కానీ ఇప్పుడు అతడు మరొక మహిళతో నిశ్చితార్థం చేసుకున్నాడని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

మధ్యప్రదేశ్ ఇండోర్‌లోని సింధీ పంచాయత్ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. విక్రమ్‌ను అక్రమంగా నివసిస్తున్నాడని ఆరోపిస్తూ దేశ బహిష్కరణ చేయాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలోనే నిఖిత నాగ్దేవ్ తన ఆవేదనను వివరిస్తూ పాకిస్తాన్ నుంచి ఒక వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేసింది. 2020 జనవరి 26వ తేదీన పాకిస్తాన్‌లో హిందూ సంప్రదాయాల ప్రకారం.. విక్రమ్ నాగ్దేవ్‌ను నిఖిత పెళ్లి చేసుకుంది. అయితే పాకిస్తాన్ ప్రభుత్వం జారీ చేసిన వివాహ ధృవీకరణ పత్రం లో మాత్రం వారి పెళ్లి తేదీ 2020 జనవరి 20వ తేదీగా ఉంది. వివాహం జరిగిన నెల రోజుల తర్వాత.. అంటే 2020 ఫిబ్రవరి 26వ తేదీన విక్రమ్ తనను భారత్‌కు

2లో

# హైదరాబాద్‌లోని ఆ రోడ్డుకు డొనాల్డ్ ట్రంప్ పేరు.....

## సంచలన నిర్ణయం తీసుకున్న రేవంత్ సర్కార్



**హైదరాబాద్, డిసెంబర్ 07 (నమస్తే హైదరాబాద్) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' నేపథ్యంలో మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. అంతర్జాతీయ ప్రముఖులు, పెట్టుబడిదారులను ఆకర్షించే విధంగా.. హైదరాబాద్‌లోని కీలకమైన రహదారులకు ప్రఖ్యాత వ్యక్తులు, సంస్థల పేర్లు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా తెలంగాణను ప్రపంచ పటంలో నిలబెట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రముఖుల పేర్లతో హైదరాబాద్ రహదారులు..

హైదరాబాద్‌ను ప్రపంచంతో అనుసంధానించే క్రమంలో... వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన ప్రముఖుల పేర్లను రోడ్లకు పెట్టడం ద్వారా వారి కృషిని గౌరవించడంతో పాటు.. నగరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఫ్యూచర్ సిటీ (Future City) లోని ప్రధాన రహదారికి ప్రముఖ పారిశ్రామికవేత్త, దార్శనికుడు రతన్ టాటా పేరు పెట్టాలని నిర్ణయించారు. ఇది దేశ ఆర్థికాభివృద్ధికి ఆయన చేసిన సేవలకు నివాళిగా నిలుస్తుంది.

అమెరికా దేశానికి చెందిన ప్రముఖులను గౌరవించే విధంగా.. యూఎస్ కాన్సులేట్ వెళ్లే రహదారికి 'ప్రెసిడెంట్ ట్రంప్ ఎవెన్యూ'గా నామకరణం చేయనున్నారు. నగరంలో సాంకేతిక రంగానికి ఉన్న ప్రాధాన్యతను చాటి చెప్పేలా మరికొన్ని కీలక

2లో

# కేసీఆర్ పోయి రేవంత్ వచ్చినా పాలనలో మార్పు లేదని విమర్శ



**హైదరాబాద్, డిసెంబర్ 07 (నమస్తే హైదరాబాద్) :** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఎలాంటి తేడా లేదని, ఈ రెండూ కుటుంబ, అవినీతి పార్టీలేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. హైదరా బాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద బీజేపీ 'రెండేళ్ల కాంగ్రెస్ నయవంచన పాలన' పేరుతో ఆదివారం మహా ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చని హామీలపై ఒక చార్జ్‌షీట్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని ఎలా దోచుకుందో చూశామని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలోనూ అదే జరుగుతోందని ఆరోపించారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ, ఇప్పుడు అప్పుల రాష్ట్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఏం చేశారని 'ప్రజా పాలన' పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆయన మండిపడ్డారు. "కేసీఆర్ పోయి రేవంత్ రెడ్డి వచ్చారంతే పాలనలో, దోపిడీలో ఎలాంటి మార్పు లేదు అని ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో ఎందుకు రాజీనామా చేయించలేదని సీఎంను నిలదీశారు. నిరుద్యోగ భృతి రూ.4 వేలు, వృద్ధులు, వికలాంగులకు పెన్షన్ల పెంపు, ఉద్యోగాల భర్తీ వంటి హామీల గతి ఏమైందని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. బెల్ట్ షాపులను రద్దు చేస్తామని చెప్పి, ఇప్పుడు మద్యం అమ్మకాలతో కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని విమర్శించారు. ఈ రెండేళ్లలో ఇచ్చిన హామీలు అమలు చేసి ఉంటే, తనతో బహిరంగ చర్చకు రావాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. ఈ ధర్నాలో బీజేపీ ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇండిగో సీఈవో కి షోకాజ్ నోటీసు జారీ





దేశవ్యాప్తంగా ఇండిగో విమాన సర్వీసుల్లో నెలకొన్న తీవ్ర అంతరాయాలపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తీవ్రంగా స్పందించింది. ప్రయాణి కులు ఎదు ర్కొంటున్న ఇబ్బందులకు సంస్థ యాజ మాన్యాన్నే బాధ్యులను చేస్తూ.. ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ రోజు కూడా పలు ఇండిగో విమానాలు రద్దు కావడంతో దేశవ్యా ప్తంగా ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఈ నేపథ్యంలో డీజీసీఏ రంగంలోకి దిగింది. సంస్థ ప్రణాళిక, పర్యవేక్షణ, వనరుల నిర్వహణలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని నోటీసులో పేర్కొంది. పైలట్ల ఫెటీగ్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన నిబం ధనలను పాటించడంలో ఇండిగో విఫలమైందని స్పష్టం చేసింది. "సంస్థ సీఈవోగా నమ్మకమైన కార్యకలాపాలు నిర్వహించడంలో, ప్రయాణికులకు అసరమైన సౌకర్యాలు కల్పించడంలో మీరు విఫలమయ్యారు''అని డీజీసీఏ ఆ నోటీసులో తీవ్రంగా వ్యాఖ్యానించిం ది.

# స్పీకర్‌కు హరీశ్ రావు ఘాటు లేఖ.

**హైదరాబాద్, డిసెంబర్ 07 (నమస్తే హైదరాబాద్) :** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీశ్ రావు ఘాటు లేఖ రాశారు. గడిచిన రెండేళ్లుగా శాసనసభలో తీవ్రమైన లోపాలు జరుగుతున్నాయని, ఇది శాసనసభ రాజ్యాంగబద్ధమైన విశ్వసనీయతను దెబ్బతీస్తోందని ఆయన ఆరోపించారు. స్పీకర్‌గా ప్రసాద్ కుమార్ రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ లేఖను విడుదల చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడంలో జరుగుతున్న తీవ్ర జాప్యంపై హరీశ్ రావు తన లేఖలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 10 మంది ఎమ్మెల్యేలపై తాము పిటిషన్లు దాఖలు చేసినా, వాటిపై నిర్ణయం తీసుకోకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(2)ను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు చేసిన తీవ్ర హెచ్చరికలను కూడా ఆయన గుర్తుచేశారు. "ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్" అన్న చందంగా ఎమ్మెల్యేల పదవీకాలం ముగిశాక తీర్పు ఇస్తే ప్రయోజనం ఉండదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన విషయాన్ని ప్రస్తావించారు. గడిచిన రెండేళ్లుగా సభా కమిటీలను ఏర్పాటు

2లో



# స్మృతి మంధాన పెళ్లి క్యాన్సిల్.



భారత మహిళా క్రికెట్ స్టార్ ప్లేయర్ స్మృతి మంధాన పెళ్లి రద్దు అయ్యింది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడించింది. గత కొన్ని వారాలుగా తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఊహాగానాల నేపథ్యంలో మంధాన సోషల్ మీడియా వేదికగా స్పందించింది. తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సుదీర్ఘ పోస్ట్‌ను షేర్ చేస్తూ, ఈ అంశంపై పూర్తి స్పష్టత

2లో

# తెలంగాణలో చలి పులి పంజా,,,

తెలంగాణలో చలి పులి పంజా విసురుతోంది. చాలా ఏరియాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. రాబోయే రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బలమైన శీతల గాలులు వీచడం, కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోవడం ఇందుకు ప్రధాన కారణంగా పేర్కొంది. వాతావరణ శాఖ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..

రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుండి 3 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయన్నారు.

2లో

# గోవాలో అగ్నిప్రమాదం

## – సిలిండర్ పేలి 25మంది మృతి

అర్పోరా గ్రామంలో ప్రమాదానికి గురైన నైట్ క్లబ్‌ను గోవా సీఎం ప్రమోద్ సావంత్ పరిశీలించారు. నైట్‌క్లబ్‌లో నిబంధనలు పాటించలేదని ప్రాథమికంగా గుర్తించామని చెప్పారు. సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతేకాకుండా ఈ క్లబ్ నడిచేందుకు అనుమతిచ్చిన అధికారులపై సైతం చర్యలు తీసుకుంటామని సీఎం పేర్కొన్నారు. ప్రమాదంపై సీఎం ప్రమోద్ సావంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది దురదృష్ట ఘటనగా పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు

# ప్రధాని మోదీకి పాకిస్తానీ మహిళ విజ్ఞప్తి

భారత్‌కు తీసుకువచ్చాడని నిఖిత తెలిపింది. అదే ఏడాది జూలై 9వ తేదీన వీసా సమస్యలు ఉన్నాయని చెప్పి విక్రమ్ తనను తిరిగి కరాచీకి పంపినట్లు పేర్కొంది. ఇక అప్పటినుంచి.. తనను తిరిగి భారతదేశానికి తీసుకురావడానికి అతను ఎలాంటి ప్రయత్నం చేయలేదని ఆరోపించింది. తనను తిరిగి భారత్‌కు తీసుకురావాలని విక్రమ్‌ను నిఖిత పదేపదే అడిగినప్పటికీ.. అతడు నిరాకరించాడని చెప్పింది.

ఈ క్రమంలోనే ఇటీవలె విక్రమ్.. ఢిల్లీకి చెందిన శివాంగి ధింగ్రా అనే మహిళతో నిశ్చితార్థం చేసుకున్నాడని పేర్కొంది. వీరి వివాహం 2026 మార్చి చివరి వారంలో జరగనుందని ఆరోపించింది. ఇక తాను ఒకసారి శివాంగి ధింగ్రాతో మాట్లాడినప్పుడు.. ఆమెకు విక్రమ్ గురించి ఏమీ తెలియదని ఖండించినట్లు నిఖిత తెలిపింది. ఈ విషయాన్ని ఇండోర్‌లోని సింధీ పంచ్ మధ్యవర్తిత్వం, న్యాయ సలహా కేంద్రంలో నిఖిత ఫిర్యాదు చేసింది.

పంచాయతీ అధ్యక్షుడు కిషోర్ కోడ్వానీ.. నిఖిత ఫిర్యాదును స్వీకరించినప్పటికీ.. ఈ అంశం తమ అధికార పరిధికి వెలుపల ఉందని.. ఆమె కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపారు. అయినప్పటికీ వారు ఈ విషయంపై కలెక్టర్‌కు లేఖ రాశారు. విక్రమ్ భారత పౌరుడు కాదని.. అతడు అక్రమంగా నివసిస్తున్నాడని పంచాయత్ ఆరోపించింది. ప్రభుత్వ అనుమతి లేకుండా అతను అక్రమంగా ఆస్తులను కొనుగోలు చేశాడని కూడా ఆరోపణలు చేసింది. విక్రమ్‌ను భారత ప్రభుత్వ నిబంధనల ప్రకారం దేశ బహిష్కరణ చేయాలని వారు డిమాండ్ చేశారు.

విక్రమ్ భారత చట్టాలను, సామాజిక నిబంధనలను పాటించడం లేదని.. సింధీ పంచాయత్ సూచించింది. అందుకే నిఖిత కరాచీ కోర్టులో న్యాయం పొందాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే వీడియో విడుదల చేసిన నిఖిత.. ప్రస్తుతం తనకు న్యాయం చేయాలని భారత ప్రభుత్వాన్ని కోరింది. లేకపోతే తాను కోర్టును ఆశ్రయిస్తానని తెలిపింది.

## హైదరాబాద్‌లోని ఆ రోడ్డుకు డొనాల్డ్ ట్రంప్ పేరు.....సంచలన నిర్ణయం తీసుకున్న రేవంత్ సర్కార్

ప్రాంతాలకు ప్రముఖ టెక్నాలజీ సంస్థల పేర్లు పెట్టాలని నిర్ణయించారు. ఇందులో గూగుల్ స్ట్రీట్, మైక్రోసాఫ్ట్ , విప్రో జంక్షన్ల పేర్లు ప్రముఖంగా ఉన్నాయి. ఈ పేర్లకు సంబంధించి అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర విదేశాంగ శాఖకు , అమెరికా రాయబార కార్యాలయానికి త్వరలో లేఖ రాయనుంది.

గ్లోబల్ సమ్మిట్‌కు ప్రపంచం నలుమూలల నుంచి రానున్న అతిథులను ఆకట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి అంశంలోనూ తెలంగాణ సాంస్కృతిక వైభవం కనిపించేలా ప్రణాళికలు రచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చారిత్రక చిహ్నాలైన చార్మినార్ , కాచిగూడ రైల్వే స్టేషన్ భవనంపై ప్రత్యేక లైటింగ్ ప్రొజెక్షన్ ఏర్పాటు చేసి.. రాష్ట్ర గొప్ప సంస్కృతిని అతిథులకు చూపించనున్నారు. సచివాలయం వద్ద అద్భుతమైన త్రీడీ ప్రొజెక్షన్ మ్యాపింగ్ ద్వారా రాష్ట్రం సాధించిన అభివృద్ధి తీరు, భవిష్యత్ లక్ష్యాలను ఆకర్షణీయంగా ప్రదర్శించనున్నారు. 'రైజింగ్ తెలంగాణ – 2047' లక్ష్యాలు అందరికీ అర్థమయ్యే రీతిలో ఈ డిస్‌ప్లేలు ఉండనున్నాయి.

# తెలంగాణలో చలి పులి పంజా,,,

చల్లని ప్రభావం ముఖ్యంగా రాత్రి, సాయంత్రం, తెల్లవారుజామన అత్యధికంగా ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెరుగుతున్న చలి తీవ్రత దృష్ట్యా.. పౌరులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ కేంద్రం విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలోని ఏడు జిల్లాలకు నేడు ఎల్లో అలర్ట్ జారీ చేసారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, కామారెడ్డి, నిర్మల్, సంగారెడ్డి జిల్లాల్లో చల్లటి గాలులు తీవ్రంగా వీస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. చల్లని పరిస్థితుల కారణంగా వృద్ధులు, పిల్లలు, గర్భిణీలు సురక్షితంగా ఉండాలని చెప్పారు. ప్రభావిత ప్రాంతాల ప్రజలు తప్పనిసరిగా తగినంత వెచ్చని దుస్తులు ధరించాలి, రాత్రి వేళల్లో బయట తిరగడం తగ్గించాలని..వృద్ధులు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.చల్లని గాలులు, తక్కువ ఉష్ణోగ్రతల వల్ల ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రైతులు, వాహనదారులు, సామాన్య ప్రజలు కూడా అదనపు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉదయం వేళల్లో రోడ్లపై పొగమంచు ప్రభావం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది కాబట్టి వాహనదారులు నెమ్మదిగా అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, సామాన్య ప్రజలు చలికి తగిన విధంగా దుస్తులు ధరించి సిద్ధంగా ఉండాలన్నారు. అవసరమైతే ప్రజలు వేడి ప్రాంతాల్లో నివాసం ఉండటం మంచిదన్నారు. రాబోయే రోజుల్లో చలి తీవ్రత మరింత పెరుగుతుందని ప్రజలు అందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఇప్పటికే హైదరాబాద్ నగరంతో పాటు చాలా ప్రాంతాల్లో 15 డిగ్రీలకు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు.

# స్మృతి మంధాన పెళ్లి క్యాన్సిల్.

ఇచ్చారు.

స్మృతి మాటల్లో..

"కొన్ని వారాలుగా నా జీవితంపై ఎన్నో ఊహాగానాలు వస్తున్నాయి. ఈ సమయంలో మాట్లాడటం, స్పష్టత ఇవ్వడం చాలా ముఖ్యమని నాకు అనిపించింది. నేను నా జీవితం ప్రైవేట్‌గా ఉండాలని కోరుకునే వ్యక్తిని. అయితే నా పెళ్లి రద్దు అయిందని స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉందనిపించింది. నేను ఈ పెళ్లి అంశాన్ని ఇక్కడితో ముగించాలని అనుకుంటున్నాను. దయచేసి మా ఇద్దరి కుటుంబాల ప్రైవసీని గౌరవించాలని కోరుతున్నాను. నా దేశానికి అత్యున్నత స్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తున్నాను. సాధ్యమైనంతవరకు దేశం తరపున ఆడి ట్రోఫీలు గెలవాలని కోరుకుంటాను. నా ఫోకస్ అంతా ఇక దానిపైనే ఉండబోతోంది" అని స్మృతి స్పష్టం చేశారు.

పలాష్ రియాక్షన్

స్మృతి మంధాన తన పెళ్లి రద్దయినట్టు ప్రకటించిన కొద్దిసేపటికే.. ఆమె మాజీ భాగస్వామి పలాష్ ముచ్చల్ కూడా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ వ్యక్తిగత బంధం నుంచి బయటకు రావడంపై వస్తున్న ఊహాగానాలకు, తప్పుడు ప్రచారాలకు ముచ్చల్ ఘాటుగా సమాధానమిచ్చారు. వ్యక్తిగత బంధం నుంచి బయటకొచ్చి, నా జీవితంలో ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నా. ఇది నా జీవితంలో చాలా కష్టమైన దశ. నిరాధారమైన ఊహాగానాలపై జనం స్పందిస్తుంటే భయమేస్తోంది. కేవలం వదంతుల ఆధారంగా నిర్ణయానికి రావడాన్ని ఒక సమాజంగా మనం ఆపేయాలని కోరుతున్నా. ఇలాంటి మాటలు మాయని గాయాలు అవుతాయి. అంతేగాదు, వీటివల్ల తీవ్ర పర్యవసానాలను ఎదుర్కొంటాం. తప్పుడు, దురుద్దేశపూరిత ప్రచారాలు చేసేవారిపై నా టీమ్ న్యాయపరమైన చర్యలు తీసుకుంటుంది" అని పలాశ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మంధాన ప్రకటనపై క్రికెట్ ప్రపంచం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. వ్యక్తిగత నిర్ణయాన్ని గౌరవిస్తూనే, ఆమె మానసిక స్థైర్యాన్ని, క్రీడపై ఆమెకున్న అంకితభావాన్ని తోటి క్రీడాకారులు, అభిమానులు అభినందిస్తున్నారు. 29 ఏళ్ల మంధాన.. ప్రస్తుతం బ్యాటింగ్‌లో అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నారు. రాబోయే టోర్నమెంట్ల కోసం ఆమె తన దృష్టిని పూర్తిగా క్రికెట్‌పై పెట్టాలని నిర్ణయించుకోవడం అభిమానులకు కొంత ఊరటనిచ్చింది.

# స్పీకర్‌కు హరీశ్ రావు ఘాటు లేఖ.

చేయకపోవడం, డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం వల్ల ప్రివిలేజ్ కమిటీ వంటివి పనిచేయడం లేదని హరీశ్ రావు విమర్శించారు. అసెంబ్లీ పనిదినాలు గణనీయంగా తగ్గిపోయాయని, ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులకు సరైన అవకాశం ఇవ్వడం లేదని, అన్‌స్టార్డ్ ప్రశ్నలకు సకాలంలో సమాధానాలు రావడం లేదని పేర్కొన్నారు.

ఈ లోపాలను సరిదిద్దేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ హరీశ్ రావు సూచనలు చేశారు. ఏడాదికి కనీసం 30 రోజులు సభను నిర్వహించాలని, సభా కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని, డిప్యూటీ స్పీకర్ ఎన్నికను పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్లపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ లేఖ ప్రతిని శాసనసభా వ్యవహారాల మంత్రికి కూడా పంపిన హరీశ్ రావు, సభ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

## నిన్నటి వరకు ఒక లెక్క... నేటి గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క: సీఎం రేవంత్ రెడ్డి

తపించానని పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో శిథిలమైన వ్యవస్థలను సరిదిద్ది, నిరుద్యోగ యువతకు కొలువుల జాతరతో కొత్త భరోసా కల్పించామని తెలిపారు. రుణభారంతో కుంగిపోయిన రైతులకు అండగా నిలిచి దేశానికే ఆదర్శంగా నిలిచామని గుర్తుచేశారు. ఆడబిడ్డల ఆకాంక్షలకు ఆర్థికంగా చేయూతనివ్వడంతో పాటు, కేవలం కొద్దిమందికే పరిమితమైన వ్యాపార రంగాన్ని బలోపేతం చేశామని వివరించారు.

సామాజిక న్యాయం తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేస్తూ, బలహీన వర్గాల వందేళ్ల ఆకాంక్ష అయిన కులగణన చేపట్టామని, మాదిగ సోదరుల దశాబ్దాల ఉద్యమానికి ఎస్సీ వర్గీకరణ ద్వారా న్యాయం చేశామని తెలిపారు. విద్యను బతుకుదెరువుకు బ్రహ్మాస్త్రంగా భావించి, 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల' నిర్మాణానికి పునాదులు వేశామని, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీలకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు.

స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం అనే మూల సిద్ధాంతాలతో ముందుకు సాగుతూ, ప్రజాకవి అందెశ్రీ రచించిన 'జయ జయహే తెలంగాణ' గీతానికి రాష్ట్ర అధికారిక గీతంగా గుర్తింపునిచ్చామని చెప్పారు.

ఈ రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రస్తావిస్తూ, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నధాన్యాలకు రూ.500 బోనస్, కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మార్చే పథకాలు తమ పాలనకు నిదర్శనాలని అన్నారు.

కేవలం నేటి అవసరాలు తీర్చడమే కాకుండా, 2047 నాటికి స్వతంత్ర భారతావని వందేళ్ల మైలురాయికి చేరేనాటికి తెలంగాణ ఎలా ఉండాలనే దానిపై లోతైన అధ్యయనంతో ఒక మార్గదర్శక పత్రాన్ని సిద్ధం చేశామని వెల్లడించారు.

"గత పాలకులు కలలో కూడా ఊహించని విజన్‌కు ప్రాణం పోసి, ప్రణాళికలతో ప్రపంచ వేదికపై రీసౌండ్ చేయడానికి సిద్ధమయ్యాం. నిన్నటి వరకు ఒక లెక్క... రేపటి గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క" అని సీఎం తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలోని నాలుగు కోట్ల ప్రజలు ఇచ్చిన ఓటు, వారి ఆశీర్వాదాలే తనకు ధైర్యాన్ని, సంకల్పాన్ని ఇచ్చాయని, వారి ప్రేమాభిమానాలే తనకు సర్వస్వమని తెలిపారు. "తెలంగాణ నాకు తోడుగా ఉన్నంత వరకు... ఈ గొంతులో ఊపిరి ఉన్నంత వరకు... కు తిరుగు లేదు" అని తన సందేశాన్ని ముగించారు.

# ఇంటింటా ప్రచారంలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి హింగే రవీందర్



**ధర్మసాగర్, డిసెంబర్ 7 (నమస్తే హైదరాబాద్ ):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి హింగే రవీందర్ ఇంటింట ప్రచారంలో దూసుకుపోతున్నారు ప్రతి ఇంటికి బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి పనులను వివరిస్తూ ఇంటింటి ప్రచారంలో పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు జరిగే మేలును గురించి చెబుతూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు బిఆర్ఎస్ పార్టీ కి సంపూర్ణ మద్దతు ప్రజలు ఇస్తున్నారు అని అభ్యర్థి అన్నారు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజల మధ్యలో ఉంటూ రైతుల కష్టంలో ముందుగా ఉంటూ నిత్యం ప్రజల మధ్య ఉంటానని గ్రామంలో ఆగిపోయిన అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు పెండింగ్లో ఉన్న పనులను మరియు పెన్షన్ దారులకు ఎలక్షన్ ముగియగానే అందరి సమస్యలు తీరుస్తానని బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి హింగే రవీందర్ హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పెద్దలు , కార్యకర్తలు,మహిళలు , వార్డు మెంబెర్ అభ్యర్థులు , యువకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బెంగళూరు రెడ్డి సంఘం లో ఎలిమినేటి సుమన్ రెడ్డికి సన్మానం




**బీబీనగర్ డిసెంబర్ 7 (నమస్తే హైదరాబాద్)** భువనగిరి జిల్లా, బీబీనగర్ మండల్, తెలంగాణ రాష్ట్ర రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర యూత్ అధ్యక్షులు ఎలిమినేటి సుమన్ రెడ్డి బెంగళూరులోని రెడ్డి సంఘం స్పెషల్ గేదరింగ్ లో పాల్గొని, రెడ్డి సంఘం వారు బెంగళూరులో తనకి మెమొంటో అందజేసి, శాలువా కప్పి సత్కరించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం సభ్యులు, కర్ణాటక రెడ్డి సంఘం సభ్యులు, బెంగళూరు రెడ్డి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీని చాటుకున్న ఆటోడ్రైవర్ శ్రీనివాస్




**కాజీపేట్ డిసెంబర్ 7నమస్తే హైదరాబాద్** కాజీపేట్ మండలం మడికొండ గ్రామంలో మన తెలంగాణ ఆటో యూనియన్ అడ్డ నుండి కాజీపేట్ కి బయలుదేరిన ఆటోలో బ్యాగు మర్చిపోయిన ప్యాసింజర్ కు తిరిగి బ్యాగు ఇవ్వడం జరిగింది. మడికొండ మన తెలంగాణ ఆటో యూనియన్ అడ్డాపై మర్చిపోయిన ప్యాసింజరకు బ్యాగు అందులో ఉన్న వెయ్యి రూపాయలు నగదు ప్యాసింజర్ కు ఇవ్వడం జరిగింది. బ్యాగు మర్చిపోయి తిరిగి ఇచ్చినందుకు పోగొట్టుకున్నటువంటి ప్యాసింజరు శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలియజేశారు .

---

# తిరుమల శ్రీవారి భక్తుల ఆకలి తీర్చేలా.. టీటీడీకి ఎన్నారై భక్తుడి భారీ విరాళం



**నమస్తే హైదరాబాద్** తిరుమల శ్రీవారికి మరో భారీ విరాళం వచ్చింది. అమెరికాకు చెందిన ఓ ఎన్ఆర్ఐ భక్తుడు టీటీడీకి రూ. 10 లక్షలు విరాళంగా అందించారు. శివ ప్రసాద్ అనే భక్తుడు టీటీడీ శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10, 01,116 విరాళంగా అందజేశారు. ఆదివారం రోజున తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో విరాళానికి సంబంధించిన డీడీని అందజేశారు. ఈ సందర్భంగా దాతను టీటీడీ అధికారులు అభినందించారు. మరోవైపు టీటీడీ ఆధ్వర్యంలోని బర్డ్ ట్రస్టుకు కూడా భారీ విరాళం అందింది.

హైదరాబాద్‌కు చెందిన ఏబీఆర్ కేఫ్ అండ్ బేకర్స్ సంస్థ టీటీడీ బర్డ్ ట్రస్ట్ కు రూ.10 లక్షల విరాళం అందించింది. సంస్థ తరుపున ప్రతినిధులు శనివారం రోజున టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడును కలిసి విరాళం తాలూకు చెక్ అందించారు.

పట్నాలో శ్రీవారి ఆలయం..

మరోవైపు అన్ని రాష్ట్రాల రాజధానులలోనూ శ్రీవారి ఆలయాలు నిర్మించాలని టీటీడీ సంకల్పించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే బిహార్ రాజధాని పట్నాలోనూ శ్రీవారి ఆలయం నిర్మిస్తున్నారు. ఈ ఆలయ నిర్మాణానికి బిహార్ ప్రభుత్వం అంగీకరించింది. బిహార్ ప్రభుత్వం నిర్ణయంపై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు పట్నాలోని మోకామా ఖాస్ ప్రాంతంలో టీటీడీ ఆలయం నిర్మించనుంది. ఈ ఆలయం కోసం బిహార్ ప్రభుత్వం 10.11 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఈ విషయాన్ని బిహార్ సీఎస్.. టీటీడీ ఛైర్మన్‌కు లేఖ ద్వారా తెలియజేశారు. టీటీడీకి కేటాయించిన స్థలంలో ఆలయాన్ని నిర్మించేందుకు బిహార్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

మరోవైపు ఆలయం నిర్మాణం కోసం తిరుమల తిరుపతి దేవస్థానానికి భూమిని 99 సంవత్సరాల పాటు అద్దెకు ఇవ్వాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రూ. 1 టోకెన్ లీజ్ రెంట్‌తో ఇవ్వాలని నిర్ణయించింది. మరోవైపు బిహార్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు.. బిహార్ ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామన్నారు. ఆ స్థలంలో టిటిడి ఆలయాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఈ నిర్ణయంతో బిహార్‌లో టిటిడి ధార్మిక కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. బిహార్ పర్యాటక శాఖ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌తో టీటీడీ ప్రతినిధులు సంప్రదింపులు జరుపుతారని..ఆలయ నిర్మాణానికి సంబంధించిన అన్ని చర్యలు చేపడుతామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరించారు.

# బిఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

*గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీమంత్రి ఎర్రబెల్లి*





**దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్):** దేవరుప్పుల మండలం లక్ష్మణ్ తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బి ఆర్ ఎస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో లక్ష్మణ్ తండా విద్య కమిటి చైర్మన్, భూక్యా రాముల మరియు గుగులోతు రవీందర్ ,గుగులోతు తారమ్మ ,భూక్యా సునీత , భూక్యా చరణ్, బిఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే దిశగా పార్టీ శ్రేణులు, కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎవరు ఎన్నికుటలు చేసినా ఎగిరే జెండా బిఆర్ఎస్ పార్టీ జెండా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బిఆర్ఎస్ పార్టీనాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# ఓటుతో ఊరు రాత మార్చండి

**మనం వేసే ఓటు ఊరు అభివృద్ధికై వేయాలి**

**ఊరు బాగు కోసం బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి ఏల సుందర్ ను గెలిపిద్దాం**

**రాష్ట్ర యువజన నాయకులు నీలారపు శ్రీపాల్ యాదవ్**

**దేవరుప్పుల( నమస్తే హైదరాబాద్)** మనం వేసే ఓటు ఐదేళ్లు అన్నం పెట్టేలా ఉండాలి కానీ ఒక్కరోజు బిర్యాని పెట్టేలాగా కాదని సేవ్ దేవరుప్పుల తరుపున రాష్ట్ర యువజన నాయకులు నీలారపు శ్రీపాల్ యాదవ్ అన్నారు. ఆదివారం దేవరుప్పుల మండల కేంద్రంలోని భార్గవి గార్డెన్స్ లో స్థానిక సంస్థల ఎన్నికలను ఉద్దేశించి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు . స్థానిక సంస్థల ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునే ప్రతి పౌరుడు ఊరు భవిష్యత్తు ప్రజల జీవితాలని పదిలంగా ఉంచడానికి జరిగే ధర్మ పోరాటంలో వినియోగించుకునే ఓటు హక్కు చాలా అమూల్యమైనదని సూచించారు. మనం వేసే ఓటు మన ఊరు అభివృద్ధికై వేయాలని మన ఊరు బాగుండాలంటే గ్రామ ప్రథమ పౌరుడు (సర్పంచ్) ముఖ్యమని మందిని ముంచే వాడు కాకుండా మంచి చేసే వాడిని ఎన్నుకోవాలని ఊరు మీద పడి బతికేటోడు కాకుండా ఊరు బాగు చేసేవాళ్ళను ఎన్నుకోవాలని అన్నారు. ఏల సుందర్ చదువుకున్న జ్ఞానవంతుడు నేర్పరి స్వయంకృషితో ఎదిగిన ఆదర్శవంతుడు ఏ పదవి లేనప్పుడే మన ఊరికి ఎన్నో సేవలు చేశాడు. ఏల సుందర్ నమ్మకమైన వ్యక్తి మన ఊరు ప్రథమ పౌరుడిగా ఒక్క అవకాశం ఇచ్చి చూద్దామని అన్నారు. ఈ మధ్యలో ఎలక్షన్ల టైంలో అక్రమంగా వచ్చిన డబ్బు కొంత మంది నొక్కి వాటిని ఖర్చు పెట్టుకుంటూ పదవి పొందాలని తాపత్రయ పడుతున్నారు. అటువంటి వ్యక్తులకు అవకాశం ఇస్తే ఊరు ఆగం చేస్తారని అన్నారు. మీ ఒక్క ఓటు విలువ.. మీ కుటుంబం ఐదేళ్ల భవిష్యత్తుతో సమానం. మీ ఓటుని అమ్ముకుంటే.. ఊరి భవిష్యత్తుని మీరే అమ్మేసినట్లవుతుంది. పంచాయతీ ఎన్నికలు కేవలం పదవుల కోసం జరిగే యుద్ధాలు కావు. అవి.. ఊరి భవిష్యత్తుని, ప్రజల జీవితాలని పదిలంగా ఉంచడానికి జరిగే ధర్మపోరాటమని అన్నారు. మీ ఓటు.. లూటీ చేసేవారిపై లాఠీ లేపేలా ఉండాలన్నారు. ప్రజల కోసం సేవ చేసే వారికే సర్పంచ్ సమరంలో అవకాశం ఇవ్వండి. కులం, బలం, వ్యక్తిగత విద్వేషాలను పక్కన పెట్టి.. కేవలం గ్రామాభివృద్ధి ఏకైక ఎజెండానే ముఖ్యమని ఆలోచించండి. ఊరు స్వరూపాన్ని మార్చే శక్తి మీ చేతిలోనే ఉంది. మీ ఓటుతో.. ఊరు రాతను మార్చుకోండి. డబ్బు ఎర వేసేవారి మైండ్ బ్లాంక్ అయ్యేలా తీర్పు ఇవ్వండి. బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి ఏల సుందర్ ను గెలిపించి సరికొత్త చరిత్రకు నాంది పలకాలని నీలారపు శ్రీపాల్ యాదవ్ కోరుతున్నానని అన్నారు. వారి వెంట కాసాని ఎర్రయ్య నీలారపు వేణు.పలుసం నరసింహులు. ఉన్నారు.

# చిల్కానగర్ ఎంపీపీ ఎస్ ప్రభుత్వ పాఠశాలకు నిధులు కేటాయించండి : కార్పొరేటర్ గీతా ప్రవీణ్

*–డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్ ని కలిసిన కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్*





**ఉప్పల్, డిసెంబర్ 7 ( నమస్తే హైదరాబాద్):** చిల్కానగర్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ శనివారం తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలాస్ ని తన కార్యాలయంలో కలిసి చిల్కానగర్ ఎంపీపీ ఎస్ ప్రభుత్వ పాఠశాలకు అదనపు గదుల కొరకు నిధులు కేటాయించాలని కోరారు. 2024 డిసెంబర్ మాసంలో గతంలో ఉన్న డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ నరసింహారెడ్డి కి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తో కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలుపుతూ, దానికి సంబంధిత ప్రొసీడింగ్ పేపర్ ని కూడా కార్పొరేటర్ గీతా ప్రవీణ్ నవీన్ నికోలస్ కి అందజేసి చిల్కానగర్ ప్రభుత్వ పాఠశాల శిధిలావస్థకు చేరిందని, పాఠశాల పిల్లలకు అదనపు గదులు లేక చాలా ఇబ్బంది పడుతున్నారని, వెంటనే పాఠశాల అదనపు గదులకు నిధులు కేటాయించాల్సిందిగా కోరడం జరిగింది. డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్ సానుకూలంగా స్పందిస్తూ ఈ ఆర్థిక సంవత్సరంలో కచ్చితంగా నిధులు కేటాయించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

# ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి



**ధర్మసాగర్ డిసెంబర్ 7 నమస్తే హైదరాబాద్** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ వాస్తవ్యులు అయిన లాగ రాజయ్య తండ్రి సాయిలు కులం ముదిరాజ్ నివాసం ధర్మసాగర్ అను వ్యక్తి యొక్క కుమారుడు యోగేశ్వర్ మరియు అతని స్నేహితులు , నిఖిల్ నిన్నటి రోజున ద్విచక్ర వాహనంపై రాత్రి సమయం అందాజ 12:30 గంటలకి ధర్మసాగర్ నుండి హనుమకొండకు వెళ్తూ ఉనికి చర్ల గ్రామం దాటిన తర్వాత వారి యొక్క ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన గల కల్వర్టు లో పడిపోగా ఫిర్యాది కుమారుడు యోగేశ్వర్ గాయాలతో అక్కడికక్కడే మరణించగా తన స్నేహితుడు నిఖిల్ కి గాయాలు అయినవి. అని దరఖాస్తు ఇవ్వగా ఇట్టి దరఖాస్తుపై ధర్మసాగర్ పోలీసు వారు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే "ప్రజాపాలన" ప్రథమ ధ్యేయం : నెమలి అనిల్ కుమార్

*–బస్తీ బాట" కార్యక్రమంలో భాగంగా స్వామి వివేకానంద నగర్ కాలనీ ఫేజ్-3 లో పర్యటించిన నెమలి అనిల్ కుమార్*






**ఉప్పల్, డిసెంబర్ 7 ( నమస్తే హైదరాబాద్):** "బస్తీ బాట" కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ డివిజన్ లోని స్వామి వివేకానంద నగర్ కాలనీ ఫేజ్-3 లో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ కాలనీ వాసులతో కలిసి ఆదివారం పర్యటించి కాలనీలో ఉన్న ప్రధాన సమస్యలను అడిగి తెలిసుకున్నారు.ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారం తో కాలనీ లో ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ గతంలో తాను చేసిన బస్తి బాట కార్యక్రమంలో వచ్చిన సమస్యలను దాదాపు అన్ని పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. అవసరమైన నిధులను తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సానాల రవికుమార్ ,ప్రధాన కార్యదర్శి పైళ్ల శ్రీనివాస్ ,ఉపాధ్యక్షులు పల్లె శివ గౌడ్ ,సంయుక్త కార్యదర్శులు పైళ్ల గౌతమ్ ,అరుణ్ కుమార్ ,కాలనీ సభ్యులు రాములు గౌడ్ ,దయాకర్ ,నవీన్ , సైదులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# బోడగుట్టలో ప్రతి నెల మొదటి ఆదివారం విగ్రహ శుద్ధి ,మాల అలంకరణ



**కాజీపేట్ డిసెంబర్ 7 నమస్తే హైదరాబాద్** 47 డివిజన్ బోడగుట్టలో జ్ఞాన శిఖరం మరియు భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారికి ప్రతి నెల మొదటి ఆదివారం రోజున విగ్రహ శుద్ధి మరియు మాల అలంకరణ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులుగా రిటైర్డ్ డిఎస్పి శ్రీ దామెర. నరసయ్య గారు, విగ్రహ ప్రతిష్ట కమిటీ చైర్మన్ శ్రీ గూడెపు.కుమారస్వామి గారు, ప్రెసిడెంట్ శ్రీ కొంగరి శ్రీనివాస్ సెక్రెటరీ శ్రీ గుండాల సదానందం. బోడగుట్ట శ్రీ వివిధ సంఘాల అధ్యక్షులు శ్రీ రామిల్ల.శేఖర్ బాబు గారు, శ్రీమతి రామిళ్ళ.విజయ శ్రీమతి మంచాల స్వప్న. సెక్రెటరీ శ్రీ గూడెం రాజేష్ శ్రీమతి మగ్గిడి సుహాసిని గారు మరియు బోడగుట్ట రిటైర్డ్ ఉద్యోగస్తులు, ఉద్యోగస్తులు, మహిళలు విద్యార్థులు మరియు చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని వారు చేసిన సేవలు గుర్తు చేసుకొని విగ్రహ శుద్ధి మరియు మాల అలంకరణ చేసి వారి ఆశయాలను కొనసాగిస్తామని నినాదాలు చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు .

# గోవా అగ్నిప్రమాదంపై స్పందించిన నరేంద్ర మోదీ



గోవాలోని ఓ ప్రముఖ నైట్‌క్లబ్‌లో ఘోర అగ్నిప్రమాదం జరిగి 25 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఉత్తర గోవాలోని అర్పోరా ప్రాంతంలో ఉన్న బిర్చ్ నైట్‌క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి గ్యాస్ సిలిండర్ పేలడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.క్లబ్‌లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మృతుల్లో 16 మంది క్లబ్ సిబ్బంది, ముగ్గురు మహిళలు, నలుగురు పర్యాటకులు ఉన్నారు. కొందరు మంటల్లో చిక్కుకుని మరణించగా, ఎక్కువ మంది దట్టమైన పొగ కారణంగా ఊపిరాడక ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు భావిస్తున్నారు.ఈ ప్రమాదంపై ప్రధాని మోదీ స్పందిస్తూ, ఇది చాలా బాధాకరమైన సంఘటన అని అన్నారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు.

# ఘనంగా సద్గురు సాయినాథ్ మందిరం ప్రథమ మహోత్సవ వేడుకలు

## – ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ కౌన్సిలర్ కంది ఆగిరెడ్డి





**ఉప్పల్, డిసెంబర్ 7 ( నమస్తే హైదరాబాద్):** హబ్సిగూడ సాయి సుఖ విస్తాస్ అపార్ట్మెంట్ లో గల సద్గురు సాయినాథ్ మందిరం ప్రథమ వార్షిక మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలో ముఖ్య అతిథి గా హబ్సిగూడా డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ కౌన్సిలర్ కంది అగిరెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రతాపరెడ్డి కంది ఆగి రెడ్డి ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి. సుధాకర్ రెడ్డి , మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి , హబ్సిగూడా డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయకుమార్ , డివిజన్ ప్రధాన-కార్యదర్శి దేవాదాయ ధర్మాదాయశాఖ డైరెక్టర్ ధర్మేంద్ర నాయక్(ధర్మా), హబ్సిగూడా డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాసునాయక్ , డివిజన్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుండురాజన్న , డివిజన్ సెక్రటరీ సుమన్ నాయక్, ఆలయ కమిటీ సభ్యులు, సాయి సుఖ విస్తాస్ అపార్ట్మెంట్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి మహాపడిపూజలో పాల్గొన్న ఎంపీఆర్





**ఉప్పల్, డిసెంబర్ 7 ( నమస్తే హైదరాబాద్):** ఉప్పల్ మున్సిపల్ స్టేడియం లో నిర్వహించిన అయ్యప్ప స్వామిపడి పూజలో ఎంపీఆర్ పాల్గొన్నారు. ఉప్పల్ మున్సిపల్ స్టేడియం లో వాకిటి ఆగం రెడ్డి స్వామి అద్వర్యం లో ఆదివారం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజకు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి లతోపాటు పెద్ద ఎత్తున అయ్యప్ప స్వాములు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మహిళా భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి, ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి లను అయ్యప్ప స్వాములు ఘనంగా సత్కరించారు.

# ఒక్క రూపాయి కూడా కట్టక్కర్లేదు....

## ఆ ఆస్పత్రిలో మెడికల్ టెస్టులు, ట్రీట్‌మెంట్, సర్జరీలు కూడా ఫ్రీ




ప్రస్తుత రోజుల్లో విద్య. వైద్యం అనేవి అందరికీ అందని ద్రాక్షపండులాగా మారిపోయాయి. నాణ్యమైన విద్య, వైద్య సౌకర్యాలు సగటు మనిషికి భారంగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించే ఆస్పత్రి ఉందంటే నమ్ముతారా. ఆ ఆస్పత్రిలో వైద్య చికిత్సలు, వైద్య పరీక్షలు మాత్రమే కాదు అవసరమైన సర్జరీలను కూడా పూర్తి ఉచితంగా చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా కూచిపూడిలో ఉంది ఈ ఆస్పత్రి. శాస్త్రీయ నృత్యానికి కేరాఫ్ అడ్రస్ అయిన కూచిపూడిలో పూర్తి ఉచితంగా సేవలు అందిస్తోంది రవిప్రకాష్ సిలికాన్ ఆంధ్ర సంజీవని ఆస్పత్రి. భారతీయ జనతా పార్టీ నేత సాధినేని యామిని శర్మ ఇటీవల ఈ ఆస్పత్రిని సందర్శించారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి విశేషాలు చెప్తూ ఆమె చేసిన ట్వీట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. “భారతదేశ శాస్త్రీయ నృత్య రాజధాని కూచిపూడి మధ్యలో ఉన్న ఒక అసాధారణ ఆసుపత్రిని సందర్శించాను. ఆస్పత్రిని చూసి నేను నిజంగా ఆశ్చర్యపోయాను. అదో ప్రపంచ స్థాయి ఆసుపత్రి, పూర్తిగా దాతృత్వంతో నడుస్తుంది. రోగ నిర్ధారణ, వైద్య పరీక్షలు, శస్త్రచికిత్సలను కూడా సున్నా ఖర్చుతో ప్రజలకు అందిస్తుంది. బిల్లు లేదు. షరతులు లేవు. వివక్ష లేదు. సిలికాన్ ఆంధ్ర వ్యవస్థాపకుడు ఆనంద్ కూచిభొట్ల దార్శనికతతో, సీనియర్ జర్నలిస్ట్ రవిప్రకాష్ సహా మరెంతో మంది సహకారంతో ఇది ఏర్పాటైంది. ఈ ఆస్పత్రిలో అధునాతన వైద్య పరికరాల నుంచి మౌలిక సదుపాయాల వరకు ప్రతిదీ నిబద్ధత, కరుణ, దార్శనికతను ప్రతిబింబిస్తుంది. ఇది కేవలం ఆసుపత్రి కాదు. ఇది మానవత్వం,సేవ., నిజమైన దేశ నిర్మాణం ఇలా ఉంటుంది” అంటూ సాదినేని యామిని శర్మ ట్వీట్ చేశారు.మరోవైపు కూచిపూడి గ్రామంలో 200 పడకల సౌకర్యంతో సిలికాన్ ఆంధ్ర సంజీవని ఆసుపత్రి ఏర్పాటు చేశారు. సిలికాన్ ఆంధ్ర మద్దతుతో పాటుగా విరాళాల సాయంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఈ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. సీనియర్ జర్నలిస్టు రవి ప్రకాష్ ఈ ఆస్పత్రి నిర్మాణం కోసం అప్పట్లో భారీగా ఆర్థిక సాయం అందించారు. కూచిపూడి సహా దాని పరిసరాల్లోని 70 గ్రామాల ప్రజలకు ఈ ఆస్పత్రి ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు.ఈ ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్‌తో పాటు కార్డియాలజీ, గైనకాలజీ, చిన్న పిల్లల విభాగాలను ఏర్పాటు చేశారు. ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, డయాగ్నోస్టిక్స్ ల్యాబ్ కూడా అందుబాటులో ఉంది. ఈ ఆస్పత్రి అందుబాటులోకి రావటంతో ఈ ప్రాంత వాసులు ఆధునిక వైద్యం కోసం విజయవాడకు వెళ్లాల్సిన అవసరం తప్పుతోంది.

# నెల జీతగానికి రూ.13 కోట్ల జీఎస్టీ బకాయిలు అని వెల్లడించిన బ్యాంకు అధికారులు

**(నమస్తే హైదరాబాద్)** నెలకు రూ.8 వేల జీతానికి పనిచేసే ఓ మహిళకు రూ.13 కోట్ల జీఎస్టీ బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు రావడం తమిళనాడులో కలకలం రేపింది. చిరుద్యోగినైన తనకు జీఎస్టీ నోటీసులు రావడం.. అదికూడా ఏకంగా 13 కోట్లు కట్టాలని అందులో పేర్కొనడంతో సదరు మహిళ నివ్వెరపోయింది. జీతం డబ్బులు విత్ డ్రా చేసుకోవడానికి వెళ్లినపుడు ఈ విషయం బయటపడింది. తమిళనాడులోని వెల్లూర్ జిల్లాలో చోటుచేసుకుందీ ఘటన. వివరాల్లోకి వెళితే..వెల్లూర్ జిల్లాలోని గుడియతమ్ ఏరియాలోని నగల్ ప్రాంతానికి చెందిన మహాలింగం కార్ డ్రైవర్.. ఆయన భార్య యశోద ప్రైవేట్ షూ కంపెనీలో పనిచేస్తోంది. షూ కంపెనీ నుంచి నెలకు రూ.8 వేలు జీతంగా అందుకుంటోంది. ఇటీవల జీతం డబ్బులు విత్ డ్రా చేసుకోవడానికి బ్యాంకుకు వెళ్లగా.. ఆమె ఖాతా ఫ్రీజ్ అయినట్లు అధికారులు తెలిపారు. ఏం జరిగిందని ఆరా తీయగా.. యశోద జీఎస్టీ బకాయిపడిందని తేలింది. నెల జీతానికి పనిచేసే తాను జీఎస్టీ ఎందుకు చెల్లించాలని ప్రశ్నించగా అధికారులు సరైన సమాధానం ఇవ్వలేకపోయారు.యశోద పేరుమీద రూ.13 కోట్ల జీఎస్టీ బకాయి ఉందని మాత్రమే రికార్డుల్లో ఉందని వివరించారు. చెన్నైలోని జీఎస్టీ ఆఫీస్ కు వెళ్లాలని సూచించారు. అయితే, అక్కడికి వెళ్లినా తమ సమస్యకు పరిష్కారం లభించలేదని,




బ్యాంకు ఖాతా పునరుద్ధరించలేదని యశోద వాపోయారు. నెల జీతం తీసుకునే పరిస్థితి లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నట్లు తెలిపారు.

# అయ్యప్ప స్వామి పూజలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు.



**నమస్తే హైదరాబాద్ (కూకట్పల్లి):** మూసాపేట్ గౌతమ్ మోడల్ స్కూల్ వద్ద కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో, సభాపతి పవన్ కుమార్ శర్మ కారకమలములచేత నిర్వహించిన అయ్యప్ప స్వామి 18వ మహా పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత ఘనంగా జరిగింది.కుమార్ గురుస్వామి ఆహ్వానం మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి పూజలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు అనంతరం, రాజు స్వామి భజన పాటలు ఆప్రాంగణాన్ని ఆధ్యాత్మికతతో నింపాయి. అయ్యప్ప స్వామి భక్తిలో ఉన్న నియమం, నియంత్రణ, నిష్ట మనిషిని ధర్మమార్గంలో నడిపే శక్తి. ఇలాంటి మహాపడి పూజలు భక్తిని మాత్రమే కాదు, సమాజంలో శాంతి%-%సౌభ్రాతృత్వ భావాలను పెంపొందిస్తాయి. సేవాభావంతో ఈ మహోత్సవాన్ని చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలియజేస్తూ, కుమార్ గురుస్వామి 18’వ పడి సందర్భంగా వారిని రాజేశ్వరరావు స్వామి శాలువాతో సన్మానించారు.కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# మున్నూరు కాపు సంఘం – ఐడి కార్డుల పంపిణీ



**హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే హైదరాబాద్):** మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నేరేడ్మెట్ ప్రాంతంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సభ్యత్వం పొందిన వారికి సంఘం ఐడి కార్డులను పంపిణీ చేశారు. రాష్ట్ర నాయకులు వెంకటేష్, వెంకటేశ్వరరావు, సింగం సత్తయ్య, తోట నగేష్, సింగం రవీందర్ కార్యక్రమంలో పాల్గొని ఐడి కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ%ౕ% కులబంధువులంతా ఏకతాటిపై ఉండి, సాధి వినియోగంతో సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజ శ్రేయస్సు కోసం ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సింగం మధుసుదన్, ప్రధాన కార్యదర్శి కొల నగేష్, తోట అంజయ్య, సింగన్న బాలరాజు, సిదయ్య, సింగం గణేష్, సింగం రాజు, సింగం పాండు, కృష్ణస్వామి, రమేష్, సాయి, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బెంగళూరులో మరో కొత్త క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని హామీ



**(నమస్తే హైదరాబాద్):**ఐపీఎల్ మ్యాచ్‌లను బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం నుంచి తరలించే ప్రసక్తే లేదని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ఇది బెంగళూరు, కర్ణాటక ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని ఆయన అన్నారు. ఆదివారం కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం ఎన్నికల్లో తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.నేను కూడా క్రికెట్ అభిమానినే. చిన్నస్వామి స్టేడియం నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లను తరలించడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం. భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటాం. స్టేడియం ప్రతిష్ఠను కాపాడతాం అని డీకే శివకుమార్ హామీ ఇచ్చారు. అంతేకాకుండా, బెంగళూరులో ప్రత్యామ్నాయంగా మరో కొత్త క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు.కిందటి సీజన్ లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు టైటిల్ గెలిచిన సందర్భంగా నిర్వహించిన విజయోత్సవాలు తీవ్ర విషాదం నింపిన సంగతి తెలిసిందే. చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించారు. 50 మందికి పైగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో, 2026 సీజన్ లో ఐపీఎల్ మ్యాచ్ లు చిన్నస్వామి స్టేడియంలో జరగకకపోవచ్చు అని వార్తలు వస్తున్నాయి.

# ఆ రైల్వేస్టేషన్‌కు మహర్దశ.. రూపురేఖలు మారుతున్నాయ్




**నమస్తే హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏపీలో రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద పలు రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. దీంతో రైల్వే స్టేషన్ల రూపురేఖలు మారుతున్నాయి. ఈ క్రమంలోనే అనకాపల్లి జిల్లా ఎలమంచిలి రైల్వేస్టేషన్‌లోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. రూ.10 కోట్లతో ఎలమంచిలి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. రెండేళ్ల కిందట పనులు ప్రారంభం కాగా.. ఏడాదిన్నర తర్వాత వివిధ కారణాలతో ఆగిపోయాయి. తాజాగా మళ్లీ తిరిగి పనులను ప్రారంభించారు. ప్లాట్ ఫాం పనులను మధ్యలోనే నిలిపివేయటంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. అయితే ఇటీవల రైల్వే ఉన్నతాధికారులు ఎలమంచిలి రైల్వేస్టేషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా నెలరోజుల్లో ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాలతో పనులు మళ్లీ ప్రారంభించారు. ఎలమంచిలి రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను దాదాపు 80 శాతం వరకూ పూర్తి చేశారు. అలాగే రైల్వే ప్రయాణికుల విశ్రాంతి భవనం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటితో పాటుగా ప్రయాణికులకు తాగునీటి వసతి ఏర్పాట్లు చేస్తున్నారు. రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంలు ఆధునికీకరిస్తున్నారు. ప్లాట్‌ఫాం పొడవునా షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో ఒకటి, రెండు ప్లాట్‌ఫాంల మధ్యలో కొత్త ఫుట్ పాత్ వంతెన నిర్మిస్తున్నారు. ఈ రెండు ప్లాట్‌ఫాం పనులు పూర్తైన తర్వాత..మూడో నంబరు ప్లాట్‌ఫాం పనులను చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు.

మరోవైపు ఎలమంచిలి రైల్వే స్టేషన్ మీదుగా ఇప్పటికే ప్రయాణికుల రాకపోకలు పెరిగాయి. దీంతో పలు రైళ్లకు ఇక్కడ స్టాపింగ్ కల్పించారు. అలాగే కొత్త రైళ్ల హాల్ట్‌కు కూడా ఆలోచనలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే అధికారుల వద్ద ఉన్నాయి. భువనేశ్వర్-బెంగళూర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో నిలపాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ ఇవ్వాలని స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ప్రయత్నాలు మొదలుపెట్టారు. మొత్తంగా అభివృద్ధి పనులు పూర్తైన తర్వాత ఎలమంచిలి రైల్వేస్టేషన్ కొత్త రూపు సంతరించుకోవటంతో పాటుగా కొత్త రైళ్లకు హాల్ట్ కూడా ఇవ్వనుంది.

# రాయ్‌పూర్-విశాఖ మధ్య 7 గంటల ప్రయాణ సమయం ఆదా

**ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఏపీలను కలుపుతున్న 6 వరుసల రహదారి**
**విశాఖ పోర్టుకు పెరగనున్న కనెక్టివిటీ.. ఎగుమతులకు ఊతం**
**భారీగా పెరిగిన భూముల ధరలు.. రైతుల్లో ఆనందం**



**నమస్తే హైదరాబాద్ :** రాయ్‌పూర్-విశాఖపట్నం మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తూ, మూడు రాష్ట్రాల వాణిజ్య రూపురేఖలను మార్చేలా నిర్మిస్తున్న ఎకనామిక్ కారిడార్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయితే, 12 గంటల ప్రయాణ సమయం కేవలం 5 గంటలకు తగ్గనుంది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గుండా సాగే ఈ ఆరు వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవే.. వాణిజ్య, పారిశ్రామిక వర్గాలతో పాటు సామాన్యులు, రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చనుంది.

మొత్తం రూ. 16,482 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ 465 కిలోమీటర్ల కారిడార్‌ను డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారి-26 మార్గంలో 597 కిలోమీటర్ల దూరం ఉండగా, ఈ కొత్త మార్గం ద్వారా 132 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఇది ఇంధన ఆదాతో పాటు రవాణా ఖర్చులను గణనీయంగా తగ్గిస్తుంది. ఈ కారిడార్‌తో ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని పరిశ్రమలు నేరుగా విశాఖపట్నం పోర్టుకు, చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారికి అనుసంధానమవుతాయి. ఫలితంగా ఎగుమతులు వేగవంతమై, లాజిస్టిక్స్ రంగం బలోపేతం అవుతుంది.

ఈ ప్రాజెక్టు స్థానిక రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పులు తెస్తోంది. "గతంలో మా భూమి ఎకరం రూ. 15 లక్షలు పలికేది. ఈ హైవే పనులు మొదలయ్యాక దాని విలువ రూ. 1.5 కోట్లకు చేరింది. ఇక్కడి రైతులంతా చాలా సంతోషంగా ఉన్నారు" అని ఓ రైతు ఆనందం వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా జామి గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే మరో రైతు మాట్లాడుతూ.. "హైవే కోసం 1.10 ఎకరాల భూమి ఇచ్చాను. నాకు మంచి పరిహారం అందింది. మిగిలిన భూమి విలువ కూడా గణనీయంగా పెరిగింది" అని తెలిపారు. ట్రక్కు యజమాని విశాల్ మాట్లాడుతూ.. "గతంలో రాయ్‌పూర్ నుంచి విశాఖకు వెళ్లాలంటే ఒకటిన్నర రోజులు పట్టేది. ఇప్పుడు పగలు బయలుదేరితే రాత్రికే గమ్యం చేరుకోవచ్చు. డీజిల్ ఖర్చు, వాహనాల నిర్వహణ భారం తగ్గుతుంది" అని వివరించారు. ఈ కారిడార్ ద్వారా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఏపీలోని మారుమూల, గిరిజన ప్రాంతాలైన కంకేర్, కోరాపుట్, అరకు, రామభద్రపురం వంటి ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం కలగనుంది.

# మన వంటకాలను అమితంగా ఇష్టపడుతున్న అమెరికన్లు

**యూఎస్‌లో పది వేల భారతీయ రెస్టారెంట్లు!**
**భారతీయ రెస్టారెంట్ల కేంద్రంగా డాలస్ మెట్రో ఏరియా**
**సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కన్నా కొందరు షెఫ్‌ల జీతమే ఎక్కువ**
**(డాలస్ నుంచి కృష్ణమోహన్ దాసరి)**




**నమస్తే హైదరాబాద్ :** కాలిఫోర్నియాలోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే ఒక తెలుగు టెకీ.. తన సహోద్యోగులకు పార్టీ ఇవ్వాలనుకున్నాడు. అందరినీ మధ్యాహ్న భోజనానికి.. దగ్గర్లోని భారతీయ రెస్టారెంట్‌కు తీసుకెళ్లాడు. తీరా అక్కడికెళ్లాక.. వారు ఆర్డర్ చేసిన మెనూ చూసి నివ్వెరపోవడం అతని వంతయింది. ఎందుకంటే.. వారందరూ ఆర్డర్ చేసింది బిర్యానీలు, మసాలా కర్రీలు, మన దక్షిణాది వంటకాలు!! అమెరికన్లు సాధారణంగా మసాలాలు తక్కువగా ఉండే వంటకాలను ఇష్టపడతారు. విదేశీ వంటకాల్లో.. థాయ్ ఆహారానికి అమెరికన్లలో ఆదరణ ఎక్కువ. మొన్నమొన్నటిదాకా భారతీయరెస్టారెంట్లకు వచ్చినా కూడా.. చికెన్ టిక్కా మసాలా, బటర్ చికెన్, నాన్లు వంటివే ఎక్కువగా తినేవారు. రానురానూ ట్రెండ్ మార్చి.. ఇప్పుడు స్పైసీగా ఉండే దక్షిణాది ఆహారాన్నీ ఇష్టంగా తింటున్నారు. అమెరికాలో చైనీస్, ఫిలిప్పీన్స్‌వాసుల తర్వాత ఎక్కువ సంఖ్యలో ఉన్న ఆసియా వాసులు భారతీయులే.

కానీ జనాభా పరంగా చూస్తే భారతీయ రెస్టారెంట్ల సంఖ్య ఇప్పటి వరకూ చాలా తక్కువ. ఇప్పుడు అమెరికన్లు కూడా మన వంటకాలను ఇష్టంగా అడిగి తింటుండడంతో.. తెలుగు ప్రవాసులు యూఎస్ నగరాల్లో రెస్టారెంట్లను విరివిగా ప్రారంభిస్తున్నారు. 2025 అక్టోబరు గణాంకాల ప్రకారం అమెరికాలో దాదాపుగా పదివేల (9438) భారతీయ రెస్టారెంట్లు ఉన్నాయి. వీటిలో 2000 ఒక్క కాలిఫోర్నియా రాష్ట్రంలోనే ఉన్నాయి! దాదాపు 1500 రెస్టారెంట్లతో టెక్సాస్.. 1000 రెస్టారెంట్లతో న్యూయార్క్ తరువాతి స్థానాల్లో ఉన్నాయి. ముఖ్యంగా న్యూయార్క్, లాస్‌ఏంజెలెస్, షికాగో, డాలస్, హ్యూస్టన్ ప్రాంతాల్లో వీటి సంఖ్య పెరుగుతోంది. డాలస్ మెట్రో ఏరియా.. దక్షిణ భారత రుచులను అందించే రెస్టారెంట్లకు హబ్‌గా మారింది. ఈ ప్రాంతంలో దాదాపు 400 ఇండియన్ రెస్టారెంట్లు ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నేపాలీ, పాకిస్థాన్, బంగ్లాదేశ్ రెస్టారెంట్లు అదనం. కానీ.. వారు కూడా తమ రెస్టారెంట్లను ఇండియన్ రెస్టారెంట్ల పేరుతోనే నిర్వహిస్తుండడం విశేషం.

లెక్క' చేయట్లేదు!

అమెరికాలో ఉండే మనోళ్లు.. గతంలో రెస్టారెంట్లలో ధరలను భారత్‌లోని ధరలతో పోల్చి చూసుకుని.. జిహ్వాచాపల్యాన్ని అదుపులో ఉంచుకునేవారు. ఇప్పుడు.. బయట తినాలని అనిపించిందే తడవుగా కుటుంబసభ్యుల్ని, మిత్రుల్ని వెంటబెట్టుకుని వెళు తున్నారు. ఈ డిమాండుకు తగ్గట్టుగా.. భారతీయులు గణనీయంగా ఉన్న ప్రతి నగరంలోనూ వీధికో ఇండియన్ రెస్టారెంటు వెలుస్తోంది. డాల్‌సలో 12 డాలర్లుండే చికెన్ బిర్యానీ, కాలిఫోర్నియాలో 25 డాలర్లు. సియాటెల్‌లో ఇంకా ఎక్కువ. అయినా.. మన రెస్టారెంట్లు కిక్కిరిసే ఉంటున్నాయి. యూఎసలో ప్రతి ఊరిలోనూ బావార్చీ బిర్యానీ, బిర్యానీ బెస్ట్రో, బిర్యానీ పాట్, హైదరాబాద్ హౌస్, ప్యారడైజ్, స్వదేశీ మొదలైన పేర్లతో రెస్టారెంట్లు పుష్కలంగా కనిపిస్తాయి. వీటితోపాటు ఇండియాలో ఎంతో ప్రసిద్ధి పొందిన శరవణ భవన్, అడయార్ ఆనంద భవన్, బార్బిక్యూ నేషన్, పిస్తా హౌస్ మొదలైన గ్రూపులు అమెరికాలో కూడా ఫ్రాంచైజీ మోడల్‌లో రెస్టారెంట్లు నిర్వహిస్తున్నాయి.

దశాబ్దాల క్రితమే..

అమెరికాలో భారతీయ రెస్టారెంట్ల విప్లవం శ్రీకారం దిద్దుకోవడానికి కాలిఫోర్నియా బర్కిలీకి చెందిన లక్కిరెడ్డి బాల్ రెడ్డి ఆద్యుడని చెప్పాలి. 40-50 సంవత్సరాలకు పూర్వమే ఆయన భారతీయ రెస్టారెంట్లను స్థాపించారు. కృష్ణాజిల్లా మైలవరం దగ్గర వెల్వడం గ్రామానికి చెందిన లక్కిరెడ్డి, 1970ల్లో ప్రారంభించిన పసంద్ అనే ఇండియన్ రెస్టారెంటు 3 దశాబ్దాలు దక్షిణ భారత వంటకాలతో అలరించింది. అదే గ్రామానికి చెందిన తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరాం ప్రారంభించిన స్వాగత్ గ్రూపు రెస్టారెంట్లు 35 ఏళ్లుగా కాలిఫోర్నియాలోని సిలికాన్ వ్యాలీ భోజన ప్రియుల జిహ్వాలను తృప్తి పరుస్తున్నాయి. మైలవరం ప్రాంతం నుంచి షెఫ్‌లుగా, రెస్టారెంటు ఓనర్లుగా వచ్చినవారు అమెరికాలో పెద్ద సంఖ్యలో ఉండడం గమనార్హం. ఇండియన్ క్విజిన్‌లో ఉండే ఇంద్రజాలం.. అమెరికన్లను కూడా సమ్మోహితుల్ని చేయడం ఇటీవలే ప్రారంభమైంది. దీంతో ఈ వ్యాపారంలోకి ప్రవేశించే వారి సంఖ్యా పెరుగుతోంది. ప్రస్తుతం అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కంటే.. కొన్ని భారతీయ రెస్టారెంట్లలో షెఫ్‌లే ఎక్కువ సంపాదిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. అమెరికాలో మనోళ్ల రెస్టారెంట్ల సంఖ్య పెరుగుతున్నా.. సక్సెస్ రేటు అనుకున్నంత లేదు. షెఫ్‌ల జీతాలు భరించలేని స్థాయిలో పెరిగిపోవడం దీనికి కారణం.

# ఈ నెల నుంచే,,,,రేషన్ కార్డు ఉన్నవారికి అవి మళ్లీ ఇస్తున్నారు

పేద ప్రజల కోసం ప్రభుత్వం రేషన్ బియ్యం సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. అయితే మారుతున్న ఆహారపు అలవాట్ల అనుగుణంగా పోషక విలువలు కలిగిన తృణధాన్యాలను ఉచితంగానే సరఫరా చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఇప్పటికే రాయలసీమ జిల్లాలలో గత ఏప్రిల్ నుంచే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డులు ఉన్నవారికి బియ్యం, పంచదారతో పాటు రాగులు, జొన్నలు పంపిణీ చేస్తోంది. ఇదే విధంగా ఉత్తర కోస్తా ప్రాంతంలోని జిల్లాల ప్రజలకు కూడా రాగులు, జొన్నలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయం పట్ల ఆ జిల్లాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం, అనకాపల్లి, శ్రీకాకుళం, అల్లూరి, మన్యం జిల్లాల్లో ఈ నెల నుంచే రాగులు పంపిణీ చేస్తున్నారు. ఇక గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో జొన్నల పంపిణీ కూడా ప్రారంభం అయింది. ఈ ప్రాంతాల్లో త్వరలో రాగులు, జొన్నలు కూడా ఇవ్వనున్నారు. కాగా, రేషన్ కార్డులు ఉన్నవారికి ప్రస్తుతం ఒక్కొక్కరికి 5 కేజీల చొప్పున బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఇక నుంచి కొంత బియ్యానికి బదులుగా.. గరిష్ఠంగా 3 కేజీల వరకు రాగులు, జొన్నలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే 20 కేజీల రేషన్ బియ్యానికి బదులు రెండు కేజీల రాగులు, 18 కేజీల బియ్యాన్ని తీసుకోవచ్చు. గతంలోనూ రేషన్‌కార్డుదారులకు రాగులు, రాగిపిండిని ప్యాకెట్ల రూపంలో పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు అలాగే రేషన్ షాపుల్లో తృణ ధాన్యాలు అందిచాలని నిర్ణయించింది.గతంలో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ స్కీమ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వమే భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ద్వారా రాష్ట్రంలో అవసరాలకు సరిపడా రాగులు, జొన్నలను కేటాయించేది. అయితే ఇప్పుడు కేంద్రం తృణ ధాన్యాలను కేటాయించడం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే వాటిని టెండరు ప్రక్రియ ద్వారా సేకరిస్తోంది. అనంతరం రేషన్ కార్డుదారులకు ఉచితంగా పంపిణీ చేస్తోంది. రాగులు, జొన్నల పట్ల ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

# ఉపాధి ఉద్యోగులకు ఊరట

**పీఆర్ తరహాలోనే ఆర్డీ ఉద్యోగులకూ సంస్కరణలు.. 43 రకాల కేడర్ల సిబ్బందిని పది కేడర్లుగా కుదింపు**
**గ్రేడ్ల ఫిక్సేషన్, వేతన సవరణ, పెంపునకు గ్రీన్‌సిగ్నల్!**
**మూడేళ్ల పూర్తయిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఎఫ్‌టీఈ**
**పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసే యోచన..**
**రెండు రోజుల్లో ఉపముఖ్యమంత్రికి అందనున్న నివేదిక**
**కొత్త సంవత్సరంలో ఉపాధి సిబ్బందికి తీపి కబురు**



**నమస్తే హైదరాబాద్ :** నెలల తరబడి వేతనాలు అందక.. ఉద్యోగ భద్రత లేక.. గ్రాట్యుటీ, హెల్త్ కార్డులు, ఇంక్రిమెంట్లు, పదోన్నతులు లేక... కొన్నాళ్లుగా నిర్వేదంలో కూరుకుపోయిన ఉపాధి హామీ పథకం సిబ్బంది కష్టాలకు త్వరలోనే తెరపడనుంది..! రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి కొత్త సంవత్సరంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీపికబురు చెప్పనున్నారు. ఆగస్టు 30న 'ఆంధ్రజ్యోతి' పత్రికలో "నిర్వేదంలో ఉపాధి సిబ్బంది" శీర్షికతో వచ్చిన వార్తకు స్పందించిన ఆయన.. పంచాయతీరాజ్ (పీఆర్) ఉద్యోగుల మాదిరిగానే గ్రామీణాభివృద్ధి (ఆర్డీ) శాఖలో పనిచేసే ఉద్యోగులకు కూడా వేతన సవరణ, వేతనాల పెంపుతోపాటు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని, సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ.. ఉన్నతాధికారులతో పలుమార్లు భేటీ అయ్యారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే పలు కేడర్ల సిబ్బందితో చర్చించి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం.. చట్టపరంగా, నిధుల వెసులుబాటును బట్టి ప్రభుత్వం ఏం చేయవచ్చో అవన్నీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. దానికి సంబంధించి సమగ్ర నివేదికను రూపొందించారు. దాన్ని ఒకటి, రెండు రోజుల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అందించనున్నారు. కొత్త సంవత్సరంలో వారికి తీపికబురు అందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ యోచిస్తోంది.


ఉపాధి సిబ్బందికీ పదోన్నతులు..

గతంలో నారా లోకేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఉపాధి సిబ్బందికి పదోన్నతులు కల్పించి, జీతాలు పెంచారు. ఆ తర్వాత ఇప్పటివరకు వారి ఎదుగుదలకు తోడ్పడే నిర్ణయాలేమీ తీసుకోలేదు. తాజాగా పలు కేడర్ల సిబ్బందికి కెరీర్ అడ్వాన్స్ ప్రక్రియ ద్వారా పదోన్నతులు కల్పించేందుకు నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఇప్పటికే పలువురు సిబ్బంది సర్వీసు, అర్హత ఉన్నప్పటికీ ఎదుగూబొదుగూ లేకుండా ఉన్నారు. ఈ నేపథ్యంలో అలాంటి వారికి పదోన్నతులు కల్పించే అవకాశం కనిపిస్తోంది. ముందుగా ఆర్థికేతర సమస్యలను పరిష్కరించి, ఆ తర్వాత వేతన సవరణ, పెంపుపై అధికారులు దృష్టి సారించనున్నారు. దీంతో పాటు ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉపాధి సిబ్బందికి కూడా ఊరట కల్పించనున్నారు. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయీస్ (ఎఫ్‌టీఈ)గా గుర్తించనున్నారు. దీంతో వారికి కూడా పలు సంక్షేమ కార్యక్రమాలు అమలవుతాయి. అదే విధంగా ఏడేళ్ల అనుభవం ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను ఎఫ్‌టీఈలుగా గుర్తించి వారి వేతనాలు పెంచనున్నారు. ప్రస్తుతం ఉపాధి సిబ్బంది 43 కేడర్లుగా ఉన్నారు. దీంతో అడ్మినిస్ట్రేషన్ పరంగా పలు సందర్భాల్లో గందరగోళం నెలకొంటోంది. దీంతో వారిని పది కేడర్లకు కుదించనున్నారు. ఈ క్రమంలో పలు కేడర్ల ఉద్యోగాల పేర్లను మార్చాలని నిర్ణయం తీసుకున్నారు.

పలు సమస్యలకు పరిష్కారం..

ఫీల్డ్ అసిస్టెంట్లకు 2018 నుంచి జీతాలు పెరగలేదు. 2016లో టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు వేతనాలు పెంచినా... కొన్ని కేడర్ల సిబ్బందికి పెరగలేదు. 2023లో ఏపీవోలకు గ్రేడ్లు ఫిక్స్ చేసి మిగతా కేడర్లకు చేయలేదు. వారి విజ్ఞప్తినీ పరిగణనలోకి తీసుకోనున్నారు. సిబ్బంది హెల్త్ పాలసీ దారుణంగా ఉంది. ఈ సమస్యలను కూడా సర్కారు పరిష్కరించనుంది. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు నివేదిక సిద్ధం చేశారు.

# చిరుతపులి దాడిలో ఐదేళ్ల బాలుడు మృతి



**నమస్తే హైదరాబాద్ :** తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలో మరో విషాద ఘటన చోటుచేసుకుంది. వాల్పారైలోని తేయాకు తోటలో చిరుతపులి దాడిలో ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు. గత ఎనిమిది నెలల్లో ఈ ప్రాంతంలో చిరుత దాడిలో చిన్నారులు మరణించడం ఇది మూడోసారి కావడంతో స్థానికంగా తీవ్ర బ ్ య ా ం ద ో ళ న ల ు వ్యక్తమవుతున్నాయి.పోలీసులు, అటవీ శాఖ అధికారుల వివరాల ప్రకారం.. వాల్పారైలోని అయ్యర్పాడి తేయాకు ఎస్టేట్‌లో పనిచేస్తున్న అస్సాం వలస కార్మికుడి కుమారుడైన సైఫుల్ (5) శనివారం తన ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో సమీపంలోని తేయాకు పొదల నుంచి ఆకస్మాత్తుగా దూసుకొచ్చిన చిరుతపులి బాలుడిని పట్టుకుని తోటలోకి లాక్కెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న తోట కార్మికులు, అటవీ శాఖ సిబ్బంది వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. కాసేపటి తర్వాత తోట లోపలి భాగంలో సైఫుల్ మృతదేహాన్ని గుర్తించారు. చిరుత దాడి చేసిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపించాయి.

# కొత్త జిల్లాలు.. పాత కష్టాలు

- నాడు విభజించి.. వదిలేసిన జగన్ సర్కారు
- 13 కొత్త జిల్లాల కేంద్రాల్లో పరిస్థితి దారుణం
- ఓ ప్రణాళిక లేకుండా హడావుడిగా ఏర్పాటు
- నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం
- తాత్కాలిక భవనాల్లోనే కార్యాలయాలు
- ఫంక్షన్ హాళ్లు, చాలీచాలని అద్దె భవనాల్లో
- కొన్ని చోట్ల ఊరికి దూరంగా ఏర్పాటు
- చాలా చోట్ల కనీస వసతులూ కరువు
- ఇరుకు గదుల్లోనే సిబ్బంది విధులు
- పలు కార్యాలయాల్లో సిబ్బంది కొరత
- అనేక శాఖలు ఇన్‌చార్జుల పాలనలోనే
- సమస్యలు పరిష్కరించని జగన్ సర్కారు
- కూటమి దృష్టిసారించాలని వినతులు

**నమస్తే హైదరాబాద్ :** నాడు జగన్ ప్రభుత్వం భౌగోళిక పరిస్థితులు, స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా అడ్డగోలుగా జిల్లాలను విభజించింది. జిల్లా కార్యాలయాల కోసం శాశ్వత భవనాలను సమకూర్చలేదు. వాటి నిర్మాణానికి నిధులు కేటాయించలేదు. కనీసం స్థలాలను కూడా సేకరించలేదు. హడావుడిగా 13 కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి వదిలేసింది. దాదాపు అన్ని కొత్త జిల్లాల్లో కలెక్టర్, ఎస్పీ వంటి అతి ముఖ్యమైన అధికారులకు మినహా ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారుల కార్యాలయాలకు తగిన వసతులతో భవనాలు లేవు. చాలా వరకు అద్దె భవనాల్లో పరాయి పంచన నడుస్తున్నాయి. దాదాపుగా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు కూడా సొంత శాశ్వత భవనాలు లేవు. డివిజన్, మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు, చాలీచాలని అద్దె భవనాలు, కాలేజీలు, ఫంక్షన్ హాళ్లు, గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా ఇతర జిల్లా స్థాయి కార్యాలయాలు ఏర్పాటు చేశారు.

కొన్నిచోట్ల జిల్లా కేంద్రాలకు దూరంగా పెట్టారు. ఉద్యోగులు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేదు. తాగునీరు కూడా లభించని పరిస్థితి. చాలా కార్యాలయాలు ఇరుకు గదుల్లో నడుస్తున్నాయి. కనీస మౌలిక వసతులు లేవు. పలు చోట్ల ఉద్యోగులు కూర్చోవడానికి సరిపడా కుర్చీలు కూడా ఇవ్వలేదు. మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఉద్యోగులు, అందులోనూ మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా ఆఫీసుల్లో సిబ్బంది కొరత ఉంది. పలు జిల్లా స్థాయి అధికారుల కార్యాలయాలు ఇన్‌చార్జిల పాలనలో నడుస్తున్నాయి. ఏ జిల్లా చూసినా గందరగోళ పరిస్థితి. జిల్లా 'పాలన' అస్తవ్యస్తం. కొత్త జిల్లాలు ఏర్పడిన తరువాత రెండేళ్లపాటు వైసీపీ అధికారంలో ఉంది. అయినా సమస్యలను పరిష్కరించలేదు. ఫలితంగా ఇప్పటికీ కొత్త జిల్లాల కేంద్రాల్లో సమస్యలు వెంటాడుతున్నాయి. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే కొన్ని విభాగాలు కొనసాగుతున్నాయి. స్టేషనరీ ఖర్చులకు కూడా ఇబ్బంది పడాల్సిన దుస్థితిని ఆయా శాఖలు ఎదుర్కొంటున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానికుల కోరిక మేరకు కొత్తగా 3 జిల్లాలు, 5 రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసింది. అలాగే కార్యాలయాలకు శాశ్వత భవనాల ఏర్పాటు, అధికారుల నియామకం తదితర సమస్యలపై దృష్టిసారించి 'పాలన'ను చక్కదిద్దాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు. 2022లో అప్పటి జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 13 కొత్త జిల్లాల కేంద్రాల్లో దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

**బాపట్ల ..**

బాపట్ల కేంద్రంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో చాలా కార్యాలయాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా జిల్లా కేంద్రంలో మౌలిక వసతుల కల్పన ఊసే లేదు. సమీకృత కలెక్టరేట్ పేరిట గత ప్రభుత్వం చేసిన హడావిడి ప్రకటనలకే పరిమితమైంది. ఓ ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన కళాశాల భవనంలో పలు కార్యాలయాలు కొనసాగుతున్నాయి. నెలల తరబడి అద్దె కూడా చెల్లించడం లేదని తెలుస్తోంది. మరికొన్ని శాఖల కార్యాలయాలు ప్రైవేటు భవనాల్లో అద్దె ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. కీలక శాఖలకు ఇన్‌చార్జి అధికారులే దిక్కయ్యారు. డీఆర్‌డీఏ, పర్యాటక, అటవీ ఇలా దాదాపు పది విభాగాలకు అదనపు బాధ్యతలతోనే నెట్టుకురావడంతో పాలనలో వేగం కనబడటం లేదు.



**నంద్యాల ..**

నంద్యాల జిల్లాలో కలెక్టర్, వ్యవసాయ శాఖ, పర్యాటక శాఖ కార్యాలయాలు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆవరణలో తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్నాయి. ఉద్యాన శాఖ, బీసీ, ఎస్సీ, ఎస్టీ శాఖల సంక్షేమ, విద్యా శాఖ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గ్రామ, వార్డు సచివాలయాల భవనాల్లో ఎస్ఎస్ఏ, జిల్లా పంచాయతీ అధికారి, డీఎల్‌పీఓ కార్యాలయాలు ఉన్నాయి. విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం తాత్కాలిక రేకులషెడ్డులో ఉంది. వైద్యఆరోగ్య శాఖ, డీసీహెచ్ఎస్ కార్యాలయాలను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని గదుల్లో ఏర్పాటు చేసుకుని పాలన సాగిస్తున్నారు.

**శ్రీసత్యసాయి ..**







**శ్రీసత్యసాయి ..**

శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో నేటికీ పరాయి పంచన, మౌలిక వసతులు లేని ఇరుకు గదుల్లోనే పాలన సాగించాల్సిన దుస్థితి. కలెక్టరేట్‌తో పాటు 90శాతం ప్రభుత్వ కార్యాలయాలకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు భవనాలను సమకూర్చింది. కొన్ని కార్యాలయాలు, అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అధికారులు కూర్చునేందుకు కుర్చీలు లేవు. బుక్కపట్నంలో పాత డైట్ కళాశాలలో సమగ్ర శిక్ష కార్యాలయం ఏర్పాటు చేశారు. ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. కొత్తచెరువులో ఎంఈఓ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి, బాలుర బీసీ హాస్టల్లో కార్మిక, ఐసీడీఎస్ కార్యాలయం ఉన్నాయి. దీనజనోద్ధరణ భవన సముదాయంలో 15కార్యాలయాల్లో వంద మందికిపైగా అధికారులు పనిచేస్తున్నారు. ఇక్కడ గుక్కెడు నీరు కావాలన్నా పుట్టపర్తికి వెళ్లాల్సిందే. రాత్రి 8.30 దాటిందంటే బస్సు సర్వీసులు కూడా ఉండవు.



**అన్నమయ్య ..**

రాయచోటి కేంద్రంగా ఏర్పాటు చేసిన అన్నమయ్య జిల్లాలో ఇప్పటికీ పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సరైన సౌకర్యాలు లేవు. పదికి పైగా కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం మినహా మిగిలిన జిల్లా ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన వసతులు లేవు. జిల్లా డ్వామా కార్యాలయం దిగువఅబ్బవరం సచివాలయంలో, డీపీవో కార్యాలయం చెన్నముక్కపల్లె సచివాలయంలో, డీఈవో కార్యాలయం, సర్వశిక్షా అభియాన్ పీవో కార్యాలయం ఒకప్పటి కొత్తపేట ఎంపీయూపీ స్కూల్‌లో ఉన్నాయి. రాయచోటి పట్టణానికి దూరంగా ఉన్న మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బీసీ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, సహకార బ్యాంకుల కార్యాలయాలు, వ్యవసాయం, ఉద్యాన, మత్స్యశాఖ, సూక్ష్మసేద్యం, డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, ఏపీ ఫైబర్‌నెట్, భూగర్భ జలశాఖ, స్పోర్ట్స్, మార్కెటింగ్ సమాఖ్య జిల్లా మేనేజర్ కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడ సిబ్బంది తాగునీటి కోసం కూడా ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ ఉన్న పల్లెలకు వెళ్లే విద్యుత్ లైను నుంచే వీటికి కనెక్షన్ తీసుకోవడంతో.. ఈ కార్యాలయాలకు ఒక్కోసారి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంటు రాదు. కార్యాలయాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో తరచూ విషసర్పాలు వస్తున్నాయి.



**పశ్చిమగోదావరి ..**

భీమవరం కేంద్రంగా ఏర్పాటైన పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్ అద్దె భవనంలోనే కొనసాగుతోంది. పట్టణానికి 3కిలోమీటర్ల దూరంలో ఉన్న కలెక్టరేట్‌కు వెళ్లడానికి రవాణా సౌకర్యం లేదు. దాతలు, మున్సిపాలిటీ సహకారంతో వసతులు ఏర్పాటు చేసుకుంటూ వస్తున్నారు. కిక్కిరిసిన గదుల్లోనే జిల్లా సర్వే, విద్యాశాఖ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. రికార్డులు భద్రపరిచే సౌకర్యాలు లేవు. సర్వే శాఖలో రికార్డులు ఒక టేబుల్‌పై దుప్పటి కప్పి ఉంచుతున్నారు. కలెక్టరేట్ భవన నిర్మాణం కోసం వైసీపీ హయాంలో స్థలం కేటాయించారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేయకుండా వదిలేశారు.



**బీఆర్ అంబేద్కర్ కోనసీమ ..**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం పేరుకే జిల్లా కేంద్రం అన్నట్టుగా పరిస్థితి ఉంది. జిల్లా కేంద్రం ఒకచోట, అనుబంధ కార్యాలయాలు మరోచోట ఉండడంతో అటు అధికారులకు, ఇటు ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అమలాపురంలో గతంలో డీఆర్డీఏ అధీనంలో ఉన్న భవనాల్లో కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేశారు. నల్లవంతెన సమీపంలో అద్దె భవనంలో ఎస్పీ కార్యాలయం ఉంది. 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముమ్మిడివరంలోని ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో 32 ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేశారు. పలు కార్యాలయాలు ముమ్మిడివరంలో ఉండడంతో అధికారులు అందుబాటులో ఉండకుండా కాన్ఫరెన్సులు, క్యాంపుల పేరుతో దూరంగా ఉంటున్నారని ప్రజలు అంటున్నారు.




**తూర్పుగోదావరి ..**

రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పాటు చేసిన తూర్పుగోదావరి పేరుకే జిల్లాగా ఉన్నట్టుంది. కలెక్టరేట్‌కు ఒక కొత్త భవనం కూడా లేదు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వివిధ వృత్తుల్లో నైపుణ్యం పెంచడం కోసం బొమ్మూరులో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ పేరిట నిర్మించిన భవనంలో కలెక్టరేట్ ఏర్పాటు చేశారు. నేక్‌ను మాత్రం గతంలో హాస్టల్‌గా వాడుకునే భవనానికి తరిమేశారు. గిరిజన యువత శిక్షణ కోసం అదే ప్రాంతంలో నిర్మించిన వైటీసీ ప్రాంగణాన్ని ఖాళీ చేయించి కొన్ని ప్రభుత్వ శాఖలకు అప్పగించారు. వీటిలో బీరువా కూడా పట్టని పరిస్థితి. గతంలో ఇక్కడి సబ్-కలెక్టర్ నివాస భవానాన్ని కలెక్టర్ నివాస భవనంగా వాడుతున్నారు. జేసీ కూడా అద్దె ఇంట్లోనే ఉండే పరిస్థితి.



**తిరుపతి ..**

తిరుపతి జిల్లాలో కలెక్టరేట్ టీటీడీకి చెందిన భవనంలో అద్దె ప్రాతిపదికన నడుస్తోంది. తిరుచానూరులోని పద్మావతి నిలయం భవనాన్ని నెలకు రూ.28 లక్షల అద్దెతో కలెక్టరేట్ కోసం తాత్కాలికంగా కేటాయించింది. 80శాతం శాఖల కార్యాలయాలకు టీటీడీ భవనంలోనే గదులు కేటాయించారు. మిగిలిన 20 శాతం శాఖల్లో కొన్ని డివిజన్ కార్యాలయాల్లో తాత్కాలికంగా నడుస్తుండగా, మరికొన్ని అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. పోలీసు, డ్వామా, డీఆర్‌డీఏ, ట్రెజరీ వంటి నాలుగైదు శాఖలకే సొంత భవనాలున్నాయి. జిల్లా రెవిన్యూ అధికారి, ఆర్డీవోలకు సొంత నివాస బంగ్లాలు లేవు. జిల్లా ఏర్పాటు కంటే ముందే తిరుపతి అర్బన్ పోలీసు జిల్లా కావడం వల్ల జిల్లా పోలీసు కార్యాలయం మాత్రమే అది కూడా ఇటీవలే నిర్మాణమైంది. శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట డివిజన్లలో సొంత భవనాలు దేనికీ లేవు.

**ఎన్టీఆర్ ..**

విజయవాడ కేంద్రంగా ఏర్పడిన ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటివరకు పలు శాఖలకు సొంత భవనాలు లేవు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ ఏర్పాటు చేయలేదు. అప్పట్లో గొల్లపూడిలోని రాష్ట్ర దేవదాయ శాఖ కార్యాలయం చెంతన ఇంటిగ్రేటెడ్ కార్యాలయానికి స్థలాన్ని పరిశీలించారు. ఆ తర్వాత వదిలేశారు. విజయవాడలో గతంలో సబ్ కలెక్టరేట్, విజయవాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఉన్న భవనాన్ని తాత్కాలికంగా కలెక్టరేట్‌గా చేసుకున్నారు. ఇక్కడి కలెక్టరేట్‌లో రెండు మూడు శాఖలు తప్ప మిగిలిన వాటికి చోటు లేదు. విజయవాడ రెవెన్యూ డివిజనల్/సబ్ కలెక్టరేట్‌ను మాంటిస్సోరి కళాశాలలో అద్దె భవనంలో ఏర్పాటు చేయాల్సి వచ్చింది. పలు కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి.


**కృష్ణా ..** వ్యవసాయ ఆధారిత కృష్ణా జిల్లా(మచిలీపట్నం కేంద్రం)లో కీలకమైన నీటిపారుదల శాఖ ఎస్ఈ పోస్టును ఎన్టీఆర్ జిల్లా పరిధిలోనే ఉంచారు. విజయవాడ నుంచే ఈ శాఖకు సంబంధించిన పరిపాలన కొనసాగుతోంది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు ఈ ఎస్ఈ ద్వారానే పరిపాలనను నెట్టుకొస్తున్నారు. పలు కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. కలెక్టర్, జేసీ కార్యాలయాలతో పాటు బంగ్లాలను కొంతమేర ఆధునికీకరించి సరిపెట్టారు.

**అల్లూరి జిల్లా...** పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇప్పటికీ ప్రభుత్వ, ప్రైవేటు భవనాల్లో కార్యాలయాలు కొనసాగుతున్నాయి. రూ.100 కోట్లతో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాల సముదాయం నిర్మించాలని గత వైసీపీ ప్రభుత్వం భావించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. కలెక్టరేట్‌తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలను యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో, ఎస్పీ కార్యాలయాన్ని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నారు. మరికొన్ని కార్యాలయాలను ఐటీడీఏ కార్యాలయంలోని పలు గదుల్లో కొనసాగిస్తున్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ వంటి పోస్టింగ్‌లు మినహా అనేక శాఖలు ఇన్‌చార్జులతోనే నడుస్తున్నాయి.

**అనకాపల్లి ..** అనకాపల్లి జిల్లా కేంద్రం అనకాపల్లిలో అత్యధిక శాతం ప్రభుత్వ కార్యాలయాలు అరకొర వసతుల నడుమ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కలెక్టర్ కార్యాలయంతో పాటు ఎస్పీ కార్యాలయం కూడా పరాయి పంచన నడుస్తున్నాయి. కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయాన్ని పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న శంకరం పంచాయతీ పరిధిలో ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇది లూప్‌లైన్ కావడంతో సొంత వాహనాలు లేనివారు అనకాపల్లి నుంచి ప్రత్యేకంగా ఆటోలను మాట్లాడుకుని వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వ శాఖల కార్యాలయాలు 45 వరకు ఉండగా, వాటిల్లో 30 శాఖల కార్యాలయాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. డీపీవో కార్యాలయాన్ని శంకరం పంచాయతీలోని సామాజిక భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ప్రతి చదరపు అడుగుకు నెలకు రూ.10 చొప్పున అద్దె చెల్లిస్తుంది. కానీ పట్టణంలో ఇంత తక్కువ అద్దెకు భవనాలు లభించకపోవడంతో పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలను సమీపంలోని గ్రామాల్లో ఏర్పాటు చేశారు.

**పార్వతీపురం మన్యం ..** పార్వతీపురం కేంద్రంగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలో నేటికీ సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు చాలా వరకు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఐటీడీఏ కార్యాలయ నిర్వహణ కోసం కొత్తగా నిర్మించిన కార్యాలయంలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నారు. మూతపడిన ఆర్‌సీఎం పాఠశాలలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. ఐదు శాఖలకు మినహా మిగిలిన శాఖలకు సొంత భవనాలు లేని పరిస్థితి. ఒకే ప్రాంగణంలో 25 ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నా కనీసం మరుగుదొడ్లు కూడా లేవు. దీంతో మహిళా ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# రాజకీయ వర్గాల్లో కలకలం



**నమస్తే హైదరాబాద్ :** మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. సామాజిక, రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను వెల్లబుచ్చుతూ ఉంటారు. పదునైన విమర్శలతో ఆయన చేసే ట్వీట్లు హాట్‌టాపిక్‌గా మారుతూ మీడియాకెక్కుతుంటాయి. ఏడాది క్రితం వైసీపీకి రాజీనామా చేసిన తర్వాత ఆయన రాజకీయాల గురించి ఎక్కువగా మాట్లాడిన దాఖలాలు లేవని చెప్పుకోవాలి. అయితే తాజాగా విజయసాయరెడ్డి మళ్లీ ఎక్స్‌లో ఫుల్ యాక్టివ్ అయ్యారుజ తన సహాజశైలిని ప్రదర్శిస్తూ తాజాగా పదునైన వ్యాఖ్యలతో ఆయన చేసిన ట్వీట్ దుమారం రేపుతోంది. హిందూ మతంపై జరుగుతున్న దాడిని ఆయన ఖండిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

డబ్బులిచ్చి హిందువుల్ని వేరే మతంలోకి లాగుతున్నారనే మాటను ప్రస్తావిస్తూ ఆయన ఎక్స్‌లో ఓ వీడియోను కూడా షేర్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హిందూ మతంపై జరిగే కుట్రలు సహించేది లేదన్న ఆయన.. డబ్బు ఆశ చూపి మతం మార్చాలని ప్రయత్నిస్తే అటువంటి వారికి తగిన రీతిలో బుద్ధి చెప్పి గుణపాఠం నేర్పిద్దామని పిలుపునిచ్చారు. గత రెండు దశాబ్దాలుగా జరిగిన మతమార్పిడులపై కమిటీ వేసి ప్రభుత్వం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దేశం కోసం ధర్మం కోసం హిందువులలో ఉన్న అన్ని సామాజిక వర్గాలు ఒక్కటవ్వాలని, అదే భారతదేశానికి రక్ష %ౌ% శ్రీరామ రక్ష అంటూ విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించారు. గతానికి భిన్నంగా విజయసాయిరెడ్డి చేసిన ఈ పోస్టే ఇప్పుడు చాలా ఇంట్రస్టింగ్‌గా మారింది. ఆయన ప్రస్తావించిన అంశాలు కూడా చర్చనీయాంశంగా ఉన్నాయి.

కాగా దాదాపు ఏడాదిగా విజయసాయిరెడ్డి వైసీపీకి దూరంగా ఉంటున్నారు. జగన్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత మీడియాతో మాట్లాడిన ఆయన.. తాను రాజకీయాలకు దూరంగా ఉంటానని, వ్యవసాయం చేసుకుంటానని తెలిపారు. పాలిటిక్స్‌కి గుడ్‌బై చెప్పినా.. తాజా రాజకీయ అంశాలపై తనదైన శైలిలో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అయితే ఇప్పుడు మత మార్పిడులకు ఆయన వ్యతిరేకంగా గళమెత్తడం ఆసక్తికరంగా మారింది. దీంతో ఇదిప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. అయితే విజయసాయిరెడ్డి బీజేపీలో చేరతారని ప్రచారం గతంలో జరగ్గా.. ఆయన ఖండించారు. ఇక జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో ఆయనకు స్నేహ సంబంధాలు ఉండటంతో జనసేనలో చేరతారనే ఊహాగానాలు కూడా వినిపించాయి. కానీ విజయసాయిరెడ్డి తాజా ట్వీట్‌తో ఆయన పొలిటికల్ రీఎంట్రీపై మళ్లీ గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదైనా జాతీయ పార్టీలో విజయసాయిరెడ్డి చేరుతారా? ఆ ఉద్దేశంతోనే ఈ ట్వీట్ చేసి ఉంటారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరి విజయసాయిరెడ్డి ట్వీట్ రాజకీయ వర్గాల్లో ఎలాంటి దుమారం రేపుతుంది అనేది చూడాలి.

# కట్టుదిట్టం.. చట్టబద్ధం ఇక అమరావతే

**పార్లమెంటులో చట్టబద్ధత దిశగా అడుగులు**
**విభజన చట్టంలో సవరణకు కేంద్ర న్యాయశాఖ ఓకే**
**సెక్షన్ 5(2)లో 'అమరావతి రాజధాని' అని స్పష్టీకరణ**
**గ్రామాలు, పరిధులు పొందుపరిచేలా బిల్లు**
**కేంద్ర మంత్రివర్గం ఆమోదించడమే తరువాయి**
**పార్లమెంటు ఆమోద ముద్రతో 'చట్టబద్ధత'**
**ఆపై... రాష్ట్ర స్థాయిలో అమరావతిని కదల్చడం అసాధ్యం**
**రాజధానిపై మూడు ముక్కలాటలు, జగన్నాటకాలకు తెర**
**కూటమి సర్కారు రాగానే తెరపైకి కీలక ప్రతిపాదనలు**
**క్యాబినెట్ తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపిన ప్రభుత్వం**






**నమస్తే హైదరాబాద్ :** తెలంగాణ ఆవిర్భావం తర్వాత నవ్యాంధ్ర 'రాష్ట్రంలేని రాజధాని'గా ఏర్పడిన సంగతి తెలిసిందే. 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం- 2014' సెక్షన్ 5లో రాజధానికి సంబంధించిన అంశాలను పొందుపరిచారు. ఇందులోని సబ్ సెక్షన్ 2లో... "విభజన తర్వాత పదేళ్ల వరకు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుంది. నవ్యాంధ్రకు 'కొత్త రాజధాని' ఏర్పాటవుతుంది" అని పేర్కొన్నారు. సబ్ సెక్షన్ 3లో... ఏపీ కొత్త రాజధానికి కేంద్ర ఆర్థిక సహకారం ఉంటుందని కూడా స్పష్టం చేశారు. అయితే... సొంత గడ్డపైనుంచే పాలన సాగించాలనే ఉద్దేశంతో చంద్రబాబు పదేళ్లకంటే ముందే 'హైదరాబాద్' నుంచి పాలనను నవ్యాంధ్రకు తరలించారు. 'అమరావతి'ని రాజధానిగా ప్రకటించారు. దీనికోసం భూమిని సమీకరించారు. 29 గ్రామాలకు చెందిన 27వేల మంది రైతులు తమ 33వేల ఎకరాల భూములను అప్పగించారు. అమరావతి పనులు మహోజ్వలంగా సాగుతున్న దశ లో... 2019లో ఎన్నికలు వచ్చాయి. జగన్ ముఖ్యమంత్రి అయ్యారు.

మూడు ముక్కలాట...

ఎన్నికలముందు 'అమరావతే రాజధాని' అని నమ్మబలికిన వైసీపీ... అధికారంలోకి రాగానే మాట మార్చింది. జగన్ మూడు ముక్కలాటకు తెరలేపారు. అసెంబ్లీలో మూడు రాజధానుల బిల్లు తీసుకొచ్చారు. కానీ, మండలిలో బలంలేక ఆ పనిచేయలేకపోయారు. ఏపీ సీఆర్డీయే చట్టంలోని బలమైన నిబంధనల నేపథ్యంలో... రాజధానికి న్యాయస్థానాలు అండగా నిలిచాయి. జగన్ సర్కారు చర్యను నిరసిస్తూ రాజధాని రైతులు సమరశీల పోరాటాలు చేశారు. కోర్టుల్లో ఓటమి తప్పదని గ్రహించిన నాటి జగన్ సర్కారు... వ్యూహాత్మకంగా మూడు రాజధానుల బిల్లును ఉపసంహరించుకుంది. జగన్ ప్రయత్నాలకు 2022 మార్చి 3న హైకోర్టు కూడా చెక్ పెట్టింది. 2024 ఎన్నికల్లో కూటమి సర్కారు అధికారంలోకి రావడం... చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావడంతో 'అమరావతి' మళ్లీ పట్టాలెక్కింది.

చట్టబద్ధత ఎందుకు? ఎలా?

'వీరు పోతే వారు... వారు పోతే వీరు... ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు అమరావతితో ఆటలాడుకోకూడదు' అనే లక్ష్యంతో ఏపీ రాజధానికి కట్టుదిట్టమైన చట్టబద్ధత కల్పించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. కూటమి సర్కారు రాగానే అమరావతిని శాశ్వతం చేసే దిశగా చర్యలు చేపట్టింది. నిజానికి... ఏది రాజధానిగా ఉండాలనేది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. ఇందులో కేంద్రం జోక్యం చేసుకోలేదు. కానీ... నవ్యాంధ్ర ఒక ప్రత్యేకమైన పరిస్థితుల్లో ఏర్పడింది. 'ఏపీకి ఒక రాజధాని ఏర్పాటవుతుంది. దానికి కేంద్రం మద్దతు ఉంటుంది' అని పార్లమెంటు ఆమోదించిన విభజన చట్టంలోనే పేర్కొన్నారు. దీనిని ఆసరాగా తీసుకునే 'అమరావతి'కి చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించారు. 2024 జూన్ 1వ తేదీతో... 'పదేళ్ల ఉమ్మడి రాజధాని' కథ ముగిసింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లోని సెక్షన్ 5 (2)లో 'ఏపీకి ఒక రాజధాని ఏర్పాటవుతుంది' అని ఉన్న చోట... 'ఏపీ రాజధానిగా అమరావతి' అని సవరణ చేస్తారు. 'అమరావతి'కి పరిధులనూ నిర్ణయిస్తారు. 'ఏపీ సీఆర్డీయే చట్టం-2014' నోటిఫై చేసిన ప్రాంతాన్ని 'అమరావతి'గా పరిగణించాలని... ఇది 217 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంటుందని నిర్దిష్టంగా స్పష్టం చేస్తారు. దీంతోపాటు భవిష్యత్తులో సీఆర్డీయే నోటిఫై చేసే గ్రామాలు కూడా 'అమరావతి' పరిధిలోకి వచ్చే వీలు కల్పిస్తూ ఈ సవరణను ప్రతిపాదించారు.

కేంద్ర న్యాయశాఖ ఆమోదం

అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఈ ఏడాది మే 12న రాష్ట్ర మంత్రివర్గం తీర్మానాన్ని ఆమోదించి... కేంద్రానికి పంపించింది. ఆ తర్వాత కేంద్రం స్థాయిలో చేసిన ప్రయత్నాలతో కదలిక మొదలైంది. ప్రతిపాదిత సవరణలపై కేంద్ర న్యాయశాఖ ప్రశ్నలన్నింటికీ ప్రభుత్వం సమాధానం చెప్పింది. సంతృప్తి చెందిన న్యాయశాఖ... ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 5(2)లో 'అమరావతి ఏపీ రాజధాని' అని చేర్చాలన్న సవరణ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. సంబంధించిన ఫైలును కేంద్ర క్యాబినెట్ ఆమోదానికి పంపించనున్నారు. ఆ తర్వాత ఏపీ పునర్విభజన చట్టం-2014 సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. అది ఆమోదం పొందగానే... 'అమరావతి'కి పార్లమెంటు స్థాయిలో చట్టబద్ధత లభిస్తుంది.

చట్టబద్ధత వస్తే...

'అమరావతి ఆంధ్రుల రాజధాని' అని పార్లమెంటులో చట్టం చేసిన తర్వాత... ఎవరు అధికారంలోకి వచ్చినా దానిని రాష్ట్ర స్థాయిలో కదిలించలేరు. మళ్లీ 'మూడు ముక్కలాటల' వంటివి మొదలుపెట్టడం సాధ్యం కాదు. రాజధానిని మార్చాలంటే... కేంద్రం పార్లమెంటులో మరోసారి 'సవరణ'లు చేయాల్సి ఉంటుంది. ఎన్డీయే హయాంలో ఇది కుదిరేపని కాదు. కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పడినప్పటికీ... 'అమరావతి' జోలికి వెళ్లే అవకాశమే లేదు. రాష్ట్ర విభజన చేసిందే అప్పటి యూపీఏ సర్కారు. నవ్యాంధ్ర రాజధానికి కేంద్ర మద్దతుతోపాటు... పలు అంశాలను అందులో అప్పుడే పొందుపరిచారు. ఈ స్ఫూర్తికి భిన్నంగా, 'జగన్నాటకాల'కు కాంగ్రెస్ సహకరించబోదు. వెరసి... పార్లమెంటులో సవరణ చట్టం ఆమోదం పొందగానే 'అమరావతి'కి చట్టబద్ధమైన బలం, రక్షణ లభిస్తుంది.

# శ్రీశైలానికి డేంజర్ బెల్స్

**డ్యాం పునాదుల కంటే లోతుకు చేరిన ప్లంజ్‌పూల్ గొయ్యి!**
**రక్షణగా పెట్టిన 62 సిలిండర్లు శిథిలం**
**కాంక్రీటు కొట్టుకుపోవడంతో.. నీటిలోపల బయటపడిన కొన్ని సిలిండర్లు**
**తక్షణం కొత్తవి అమర్చాలి.. లేదంటే ముప్పే!**
**సీడబ్ల్యూపీఆర్ఎస్, సీలైన్ సంస్థల నివేదికలు**
**ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ఇంజనీర్లు**
**వీటికి రూ.160-180 కోట్ల వ్యయం!**
**అప్రోచ్ రోడ్డు, ఇతర మరమ్మతులకు 203 కోట్లిచ్చిన చంద్రబాబు ప్రభుత్వం**
**ఇప్పటికే టెండర్లు పిలిచిన అధికారులు**
**కొండరాళ్లు జారకుండా షాట్ క్రీటింగ్‌కూ**



**నమస్తే హైదరాబాద్ :** శ్రీశైలం జలాశయం ప్రమాదపుటంచుల్లో ఉందని.. ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన భారీగొయ్యి విస్తరించడం.. ఆనకట్ట రక్షణకు అమర్చిన 62 సిలిండర్లు దెబ్బతినడం ప్రమాద సంకేతాలని అధ్యయన సంస్థలు తమ నివేదికల్లో స్పష్టం చేశాయి. 2009 అక్టోబరులో 25.5 లక్షల క్యూసెక్కుల అతిభారీ వరద రావడంతో ప్రాజెక్టు దెబ్బతింది. 2014 సెప్టెంబరు 23న ఢిల్లీలో కేంద్ర జలవనరుల శాఖ శ్రీశైలం డ్యాం సహా వివిధ ప్రధాన ప్రాజెక్టుల భద్రతా, నిర్వహణ లోపాలపై సమీక్షించింది. ఆ తర్వాత పదేళ్లలో కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ డాక్టర్ వైకే మూర్తి, సీడబ్ల్యూసీ మరో మాజీ చైర్మన్, డ్యాం భద్రత నిపుణుడు ఏబీ పాండ్యా, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ మాజీ, ప్రస్తుత చైర్మన్లు వివేక్ త్రిపాఠి, అనిల్ జైన్ సహా అనేకమంది నిపుణులు, ప్యానెళ్లు, కమిటీలు ప్రాజెక్టును సందర్శించాయి. పలు లోపాలు ఎత్తు చూపుతూ డ్యాం భద్రతకు తీసుకోవలసిన చర్యలపై పలు సూచనలు చేశాయి. డ్యాం దిగువన ఏర్పడిన ప్లంజ్‌పూల్ భారీ గొయ్యి సహా నదీగర్భం, రాతికట్ట కోతకు గురవుతున్నాయని.. డ్యాం భద్రత దృష్ట్యా నిరంతర పర్యవేక్షణ అవసరమని సూచించాయి. అయినా పాలకులు నిర్లక్ష్యం వీడలేదు. గతవైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లూ నిర్వహణపై అంతులేని నిర్లక్ష్యం.. డ్యాం పాలిట శాపంగా మారింది. చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అప్రోచ్ రోడ్డు నిర్మాణం సహా పలు మరమ్మతులకు రూ.203 కోట్లు కేటాయించింది. అయితే కొత్త సిలిండర్ల ఏర్పాటు ఈ పనుల్లో లేదు. ప్రస్తుతం వీటి కోసం అంచనాలు సిద్ధం చేస్తున్నారు. ఎంతలేదన్నా.. సిలిండర్లకు రూ.160 నుంచి 180 కోట్ల వరకు ఖర్చవుతుందని రిటైర్డ్ ఇంజనీర్లు అంటున్నారు.పలు సంస్థల అధ్యయనాలు..: వాస్తవానికి 2009లో వచ్చిన భారీ వరదల కారణంగానే ప్లంజ్‌పూల్ గొయ్యి బాగా పెద్దదైంది. సిలిండర్లు దెబ్బతినడమే కాదు.. అప్రోచ్ రోడ్డు ఆనవాళ్లే లేకుండా కొట్టుకుపోయింది. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు సీఎం అయ్యాక ప్లంజ్‌పూల్ గొయ్యిపై 2018లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ (ఎన్ఐవో) సంస్థ అధ్యయనం చేసింది. గొయ్యి 42 మీటర్లు లోతు లో ఉందని నివేదిక ఇచ్చింది. 2020 ఫిబ్రవరి 25న ఏబీ పాండ్యా సారథ్యంలో నియమించిన కమిటీ 2021లో నివేదిక ఇచ్చింది. అనంతరం నాటి ఎన్‌డీఎసఏ చైర్మన్ వివేక్ త్రిపాఠి ఆధ్వర్యంలోని నిపుణుల బృందం కూడా రిపోర్టు ఇచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎన్‌డీఏసఏ చైర్మన్ అనిల్‌జైన్ శ్రీశైలం డ్యాంను సందర్శించారు. డ్యాం రక్షణ కోసం ఏర్పాటు చేసిన 67 సిలిండర్లలో 62 పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. ప్లంజ్‌పూల్ ప్రమాదకరంగా మారిందని నిపుణులు ఇచ్చిన నివేదికలు చెబుతున్నాయని.. 2009 వరదలకు దెబ్బతిన్న డ్యాం మరమ్మతులు చేపట్టకపోవడం, నిపుణుల సూచనలకు అనుగుణంగా అవసరమైన చర్యలు చేపట్టకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. రాష్ట్రప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. దాంతో ప్లంజ్‌పూల్ గుంత వల్ల డ్యాం ఆనకట్ట, పునాదులకు ఏ స్థాయిలో ప్రమాదం పొంచి ఉందో.. అధ్యయనం చేసేందుకు పుణేలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్‌కు అప్పగించారు. అలాగే.. డ్యాంకు రక్షణగా ఏర్పాటుచేసిన సిలిండర్ల తాజా పరిస్థితిని తెలుసుకునే బాధ్యతను విశాఖకు చెందిన సీలైన్ ఆఫ్‌షోర్ డైవింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టింది. ఈ సంస్థలు లోతుగా అధ్యయనం చేసి వేర్వేరుగా నివేదికలిచ్చాయి.

**పునాదుల కంటే లోతులో..** ప్లంజ్‌పూల్ గొయ్యి 42 మీటర్లు లోతులో ఉందని ఎన్ఐవో గతంలోనే తెలుపగా.. సీడబ్ల్యూపీఆర్ఎస్ కూడా దాదాపు ఇదే చెప్పింది. ఈ సంస్థ ఇంటిగ్రేటెడ్ బాతిమెట్రి సిస్టమ్(ఐబీఎస్), సింగల్ బీమ్ డ్యూయల్ ఫ్రీక్వెన్సీ ఎకోసౌండర్, మోటరైజ్డ్ సర్వే బోట్‌లో అమర్చే డీజీపీఎస్, నావిగేషన్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి సర్వే చేపట్టింది. ప్లంజ్‌పూల్ గొయ్యి 43-45మీ. లోతులో, 400మీ. పొడవు, 270మీ. వెడల్పున ఉందని.. 2018 నాటి గోతితో పోలిస్తే పెద్దగా తేడా లేదని తేలినట్లు వెల్లడించింది. అయితే డ్యాం ఆనకట్ట పునాదులు కుడి, ఎడమ కొండల పక్కన 15-18 మీటర్ల లోతున, మధ్యలో 30-40 మీ. లోతున ఉన్నాయని రిటైర్డ్ ఎస్ఈ ఒకరు వెల్లడించారు. పునాదుల లోతు కంటే ప్లంజ్‌పూల్ గొయ్యి ఎక్కువ లోతులో ఉండడం డ్యాంకు ప్రమాదమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ గొయ్యి అప్రాన్ నుంచి 15 మీ తర్వాత మొదలవుతుంది.

**డ్యాం రక్షణకు అత్యంత కీలకం సిలిండర్లు** శ్రీశైలం డ్యాం భద్రతలో అత్యంత కీలకమైనవి సిలిండర్లు. డ్యాం నిర్మాణ సమయంలో ఆనకట్ట ముందు భాగంలోని రాళ్లు కొట్టుకుపోయాయి. దీంతో డ్యాం రక్షణకు 1978-79లో ఆనకట్ట నుంచి 13-15 మీటర్లు పొడవు, 3-4 మీటర్ల మందంతో సీసీ కాంక్రీట్‌తో అప్రాన్ నిర్మించారు. ఆ తర్వాత వచ్చిన వరదలకు అప్రాన్‌కు కూడా కాంక్రీట్ పెచ్చులు ఊడిపోతుండంతో శాశ్వత రక్షణలో భాగంగా 1986-89 మధ్య దాదాపు 67 సిలిండర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో సిలిండర్‌ను రెండు మీటర్ల వ్యాసంలో, 18-20 మీటర్లు లోతులో ఏర్పాటు చేశారు. 20 మీటర్ల లోతులో ఒక మీటరు కాంక్రీట్ వేసి ఆ కాంక్రీట్‌పైన డ్యాం కుడి, ఎడమ రెండు కొండల మధ్య వీటిని అమర్చారు. వాటిని కాంక్రీట్‌తో నింపినట్లు రిటైర్డ్ ఇంజనీర్లు తెలిపారు. ప్లంజ్‌పూల్ భారీ గొయ్యి ఆనకట్ట వైపు విస్తరించకుండా ఈ సిలిండర్లు రక్షణగా ఉంటున్నాయి. అయితే 2009లో సంభవించిన భారీ వరదలకు సిలిండర్లు భారీగా దెబ్బతిన్నాయి. ఏ మేరకు దెబ్బతిన్నాయో గుర్తించే బాధ్యతను విశాఖకు చెందిన సీలైన్ ఆఫ్‌షోర్ డైవింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారు. దీని అధ్యయనంలో విస్తుగొలిపే నిజాలు వెలుగు చూశాయి. వరదలకు కాంక్రీటు మొత్తం కొట్టుకుపోయి.. 62 సిలిండర్లు పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్నాయని.. వీటిలో కొన్ని ఎలాంటి ఆధారం లేకుండా లోపల నీటిలోనే తేలుతున్నట్లు గుర్తించారు. సిలిండర్లు పాడైపోవడంపై నిపుణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

**తెలుగు రాష్ట్రాల జీవనాడి** కృష్ణానదిపై నిర్మించిన మొట్టమొదటి జలవిద్యుత్ ప్రాజెక్టు శ్రీశైలం. తర్వాత దానిని బహుళార్థ సాధక ప్రాజెక్టుగా మార్చారు. ఎన్నో ఏళ్లుగా ఇది తెలుగు రాష్ట్రాలకు ప్రాణాధారమైంది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 1963 జూలై 24న అప్పటి ప్రధాని నెహ్రూ శంకుస్థాపన చేశారు. 20ఏళ్లకు నిర్మాణం పూర్తయింది. 1984లో ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. 143.26 మీ. ఎత్తు, 512మీ. పొడవున్న గ్రావిటీ ఆనకట్ట ఇది. 308.04 టీఎంసీ ల సామర్థ్యంతో నిర్మాణం చేసినా.. తర్వాత పూడిక చేరడంతో నిల్వసామర్థ్యాన్ని 215.807 టీఎంసీలకు కుదించారు. ఆనకట్ట స్పిల్‌వే పొడవు 266.4 మీటర్లు. స్పిల్‌వేకు ఇరువైపులా నాన్-ఓవర్‌ఫ్లో విభాగాలు ఉన్నాయి.

# భారతదేశ ఆధ్యాత్మిక శక్తి కేంద్రం ఉడుపి అని అభివర్ణించిన వైనం

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కర్ణాటకలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఉడుపిని సందర్శించారు. ఈ పవిత్ర భూమి భారతదేశపు ఆధ్యాత్మిక శక్తి కేంద్రమని ఆయన అభివర్ణించారు. శ్రీకృష్ణుడు నిత్యం కొలువై ఉండే ఈ నేలపై అడుగుపెట్టడం తన అదృష్టమని పేర్కొన్నారు. బృహత్ గీతోత్సవం శుభ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు కోరుకోవడానికి ఇక్కడికి వచ్చానని తెలిపారు. పవన్ కల్యాణ్ సోషల్ మీడియాలో స్పందిస్తూ"శ్రీకృష్ణుడు కొలువైన, ముఖ్యప్రాణ హనుమంతుడు శాశ్వత సంరక్షకుడిగా నిలిచిన, జగద్గురు మధ్వాచార్యులు తన జ్ఞానంతో ఎందరినో చైతన్యపరిచిన పవిత్ర భూమి ఉడిపి. మన నాగరికతకు ఆత్మలాంటి భగవద్గీత సందేశాన్ని జరుపుకునేందుకు భక్తులతో కలవడం ఆనందంగా ఉంది" అని తెలిపారు.శ్రీ సుగుణేంద్ర తీర్థ స్వామీజీ దార్శనిక మార్గదర్శకత్వంలో ఈ పవిత్ర భూమి చారిత్రక ఆధ్యాత్మిక ఉద్యమాలకు సాక్షిగా నిలుస్తోందని పవన్ ప్రశంసించారు. కోటి భగవద్గీత చేతిరాత ప్రాజెక్టు నుంచి లక్ష కంఠ పారాయణం వరకు చేపట్టిన కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిస్తున్నాయని కొనియాడారు. భగవద్గీత సందేశం మన చర్యలకు మార్గనిర్దేశం చేసి, సమాజాన్ని బలోపేతం చేసి, జాతీయ స్ఫూర్తిని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం జై శ్రీ కృష్ణ, జై హనుమాన్, జై హింద్ అంటూ తన సందేశాన్ని ముగించారు.

# సినిమా



## ఒకప్పుడు కుర్రాళ్ల డ్రీమ్ గర్ల్..

దక్షిణాది చిత్రపరిశ్రమలో 1990లలో అందం, అభినయంతో కట్టిపడేసిన హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. అందులో ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న నటి ఒకరు. ఆమె అప్పట్లో కుర్రాళ్ల కలల అమ్మాయి. తమిళం, మలయాళం, తెలుగు, కన్నడ భాషలలో స్టార్ హీరోల సినిమాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. సహజ సౌందర్యం, ప్రతిభావంతులైన నటనతో అభిమానుల హృదయాల్లో స్థానం సంపాదించుకుంది. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న నటి పేరు సితార. ఒకప్పుడు క్రేజీ హీరోయిన్. ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టు. ప్రస్తుతం ఆమె వయసు 52 సంవత్సరాలు. ఇప్పటికీ పెళ్లి చేసుకోకుండా ఒంటరిగా ఉంటుంది.

1986లో మలయాళ చిత్రం కావేరితో సితార నటిగా సినీప్రయాణం స్టార్ట్ చేసింది. మమ్ముట్టి, మోహన్ లాల్ నటించిన ఈ చిత్రం ఆమెకు గొప్ప పరిచయాన్ని ఇచ్చింది. దర్శకుడు కె. బాలచందర్ చిత్రం పుదుపుతు అర్ధంగల్ తో సితార తమిళంలో అడుగుపెట్టింది. ఆ చిత్రంలో కనిపించిన కేలడి కన్మణి అనే ఒకే ఒక్క పాట ఆమెను మరింత పాపులర్ చేసింది. తర్వాత తెలుగు, తమిళం, మలయాళంలో వరుస సినిమాల్లో నటించింది. సితారకు ఒకప్పుడు పెళ్లి చేసుకోవాలని కలలు ఉండేవట. కానీ ఆకస్మాత్తుగా తండ్రి చనిపోవడంతో ఆమె జీవితం తలకిందులైంది. తండ్రి మరణం తర్వాత కుటుంబ బాధ్యత మొత్తం సితార భుజాలపై వేసుకుంది.

తండ్రి కోరిక తీర్చడానికి, ఆమె తన తమ్ముడిని చదివించి డాక్టర్‌ను చేసింది. ఈ కుటుంబ బాధ్యతల మధ్య ఆమె పెళ్లికి దూరంగా ఉండిపోయింది. ఒకప్పుడు హీరోయిన్ గా బిజీగా ఉన్న సితారకు ఆ తర్వాత అవకాశాలు సైతం తగ్గిపోయాయి. దీంతో ఆమె సహాయ నటిగా మారింది. సినిమాలతోపాటు సీరియల్స్ సైతం చేసింది. ఇప్పటికీ సినిమాల్లో పలు పాత్రలు పోషిస్తూ బిజీగా ఉంటుంది.





## పడుకునే ముందు ఓ కప్పు తాగితే..

ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవడం మంచిది.. అయితే.. మన శరీరానికి మేలు చేసే వాటిలో పుదీనా ఒకటి.. దీనిలో ఆరోగ్యాన్ని కాపాడే ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి.. యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ-డయాబెటిక్ గుణాలు.. మనల్ని మరింత ఆరోగ్యవంతంగా మారుస్తాయి.. అయితే.. రాత్రి పూట పడుకునే ముందు పుదీనా టీ తాగితే.. ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పుదీనాలో మానసిక స్థితిని మెరుగుపరిచే.. ఒత్తిడిని తగ్గించే అనేక పోషకాలు ఉన్నాయి. పడుకునే ముందు పుదీనా టీ తాగడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో తెలుసుకోండి..

పుదీనా టీ తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు:

జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది: పుదీనాలో సహజ యాంటిస్పాస్మోడిక్ లక్షణాలు ఉన్నాయి.. ఇవి జీర్ణవ్యవస్థలోని కండరాలను సడలించడానికి సహాయపడతాయి. ఇది గ్యాస్, ఉబ్బరం %-% అజీర్ణాన్ని తగ్గిస్తుంది.. ఇవి రోజంతా సక్రమంగా తినకపోవడం వల్ల రాత్రిపూట తరచుగా తీవ్రమవుతాయి. ఒక అధ్యయనంలో పుదీనా నూనె ప్రకోప ప్రేగు సింద్రోమ్ లక్షణాలను గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది.

నిద్రకు సహాయపడుతుంది : పుదీనా సహజంగా కెఫిన్ లేనిది.. దాని సువాసన మనస్సును ప్రశాంతపరుస్తుంది. పుదీనా టీ శరీరం, మనస్సును విశ్రాంతి తీసుకునేలా చేయడం ద్వారా, కండరాల ఉద్రిక్తతను తగ్గిస్తుంది. అంతేకాకుండా జీర్ణక్రియకు సహాయపడటం ద్వారా నిద్రను ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. పడుకునే ముందు దీనిని తాగడం వల్ల జీర్ణవ్యవస్థలోని అసౌకర్యాన్ని తగ్గించడంతోపాటు.. నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

ఒత్తిడిని తగ్గిస్తుంది: పుదీనా టీ సువాసన, సహజ ఉపశమన లక్షణాలు ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి.. ప్రశాంతతను కలిగిస్తాయి. పుదీనా సువాసన నాడీ వ్యవస్థపై శాంతపరిచే ప్రభావాన్ని చూపుతుంది.. దీనిని క్రమం తప్పకుండా తీసుకుంటే, రోజంతా ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది.

శ్వాసను తాజాగా చేస్తుంది: పుదీనాలోని సహజ యాంటీ బాక్టీరియల్ లక్షణాలు దుర్వాసనకు కారణమయ్యే బ్యాక్టీరియాను తగ్గించడంలో సహాయపడతాయి. రాత్రిపూట దీనిని తాగడం వల్ల మీ నోరు ఉదయం వరకు తాజాగా ఉంటుంది.

పుదీనా టీ ఎలా తయారు చేయాలి?

పుదీనా టీ తయారు చేయడానికి, పుదీనా ఆకులను నీటితో శుభ్రం చేసుకోండి. ఒక పాన్‌లో నీటిని తీసుకోండి.. దానిలో పుదీనా ఆకులను జోడించండి. 5 నుండి 10 నిమిషాలు నానబెట్టండి. లేదా మరిగించండి.. నీరు మరిగిన తర్వాత, దానిని వడకట్టి, ఒక కప్పులో తాజా నిమ్మరసం జోడించి తాగండి..



## మొండి సమస్యలకు సంజీవని..!

భారతీయ వంటగదిలో లభించే కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు ఆహార రుచిని పెంచడమే కాకుండా శరీరానికి కూడా మేలు చేస్తాయి. ఉల్లిపాయలు వాటిలో ఒకటి వీటిని అనేక విధాలుగా ఆహారంలో చేర్చుకోవచ్చు. సోడియం, పొటాషియం, ఫోలేట్లు, విటమిన్లు ఎ, సి, ఇ, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, ఫాస్ఫరస్ వంటి ఉల్లిపాయల లక్షణాలు శరీరాన్ని అనేక సమస్యల నుండి రక్షించడంలో సహాయపడతాయి. మీరు శరీరంలో అధిక కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవాలనుకుంటే ఉల్లిపాయ బెస్ట్ రెమిడీ అవుతుంది. కాబట్టి ఆలస్యం చేయకుండా ఉల్లిపాయ జ్యూస్ తాగడం వల్ల కలిగే లాభాలు, దీన్ని ఎవరు ఎక్కువగా తీసుకోవాలో తెలుసుకుందాం.ఉల్లిపాయ రసం కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో, రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. మీరు అధిక రక్తపోటు సమస్యతో ఆందోళన చెందుతుంటే మీరు ఉల్లిపాయ జ్యూస్ తీసుకోవచ్చు. ఉల్లిపాయలలో క్వెర్సెటిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడే యాంటీఆక్సిడెంట్. ఉల్లిపాయ రసంలో సల్ఫర్ సమ్మేళనాలతో పాటుగా ఫ్లేవనాయిడ్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను కరిగిస్తాయి. బీపీ తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి.

ఉల్లిపాయ రసంలో తేనె కలిపి తాగడం వల్ల వ్యాధనిరోధశక్తి పెరుగుతుంది. ఉల్లిపాయ రసంలోని విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు చిన్న చిన్న ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ అందిస్తాయి. ఉల్లిపాయ రసం తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ఉల్లిపాయ రసంలోని క్రోమియం డయాబెటిస్ నుంచి రక్షణ అందిస్తుంది. ఉల్లిపాయ రసంలో ఫైబర్‌తో పాటుగా ప్రీబయోటిక్స్ ఉంటాయి. ఇవి పేగు ఆరోగ్యాన్ని కాపాడతాయి.ఉల్లిపాయ రసం తాగితే మలబద్దకం, అజీర్తి తగ్గుతుంది. ఉల్లిపాయ రసంలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ కణాలు పెరగడాన్ని కంట్రోల్ చేస్తాయి. ఉల్లిపాయ రసం తాగితే క్యాన్సర్ రిస్క్ తగ్గుతుంది. ఉల్లిపాయ రసంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి మంట, వాపును కంట్రోల్ చేస్తాయి. ఉల్లిపాయ రసం తాగితే దీర్ఘకాలిక సమస్యలు తగ్గుతాయి.

ఉల్లిపాయ రసంలోని పోషకాలు దగ్గు, జలుబు, గొంతు నొప్పిని కంట్రోల్ చేస్తాయి. ఉల్లిపాయ రసం తాగితే శీతాకాలంలో వచ్చే ఈ సమస్యలు తగ్గుతాయి. ఉల్లిపాయ రసంలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఉల్లిపాయ రసం తాగితే ముడతలు తగ్గుతాయి. మచ్చల్లేని చర్మం పొందవచ్చు. ఉల్లిపాయ రసంలో సల్ఫర్ సమ్మేళనాలు ఉంటాయి. ఉల్లిపాయ రసం రాసుకోవడం, తాగడం వల్ల జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.

## కైఫ్ సంచలన వ్యాఖ్యలు

దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో భారత్ అద్భుత విజయం సాధించిన తర్వాత, మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ టీమిండియా భవిష్యత్తుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ప్రాముఖ్యతను గురించి మాట్లాడుతూ, 2027 ప్రపంచ కప్‌లో వీరిద్దరూ లేకుండా భారత్ గెలవడం కష్టమని అభిప్రాయపడ్డాడు.

'వారిద్దరూ లేకపోతే కష్టమే'..

విశాఖపట్నంలో జరిగిన మూడో వన్డేలో భారత్ ఘన విజయం సాధించి సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్ అనంతరం కైఫ్ తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ, "రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లేకపోతే భారత్ 2027 ప్రపంచ కప్ గెలవలేదు. యువ ఆటగాళ్లు ఎంత ప్రతిభావంతులైనప్పటికీ, ప్రపంచ కప్ వంటి పెద్ద టోర్నమెంట్లలో ఒత్తిడిని జయించడానికి అనుభవం చాలా అవసరం," అని పేర్కొన్నారు.

కోహ్లీ రికార్డుల మోత..

ఈ సిరీస్‌లో విరాట్ కోహ్లీ ప్రదర్శనను కైఫ్ ఆకాశానికెత్తారు. "కోహ్లీ ఈ సిరీస్‌లో రెండు వరుస సెంచరీలు చేయడమే కాకుండా, మూడో వన్డేలో 45 బంతుల్లోనే అజేయంగా 65 పరుగులు చేసి తన ఫామ్‌ను నిరూపించుకున్నాడు. అతను కేవలం 2027 వరకే కాదు, ఆ తర్వాత కూడా ఆడే సత్తా ఉన్న ఆటగాడు. ప్రస్తుతం అతను ఆడుతున్న తీరు చూస్తుంటే, తన రిటైర్మెంట్ గురించి వస్తున్న సందేహాలన్నింటికీ బ్యాట్‌తోనే సమాధానం చెబుతున్నట్లుంది," అని కైఫ్ వ్యాఖ్యానించారు.

రోహిత్ శర్మ కొత్త శైలి..

రోహిత్ శర్మ బ్యాటింగ్ గురించి మాట్లాడుతూ, "రోహిత్ ఇప్పుడు కేవలం మెరుపు ఇన్నింగ్స్‌లకే పరిమితం కావడం లేదు. పరిస్థితిని బట్టి ఆడుతూ, వికెట్ విలువను కాపాడుకుంటున్నాడు. మూడో వన్డేలో అతను చేసిన 75 పరుగులు ఇందుకు నిదర్శనం. కెప్టెన్సీ లేకపోయినా, ఒక సీనియర్ బ్యాటర్‌గా బాధ్యతాయుతంగా ఆడుతూ పెద్ద ఇన్నింగ్స్‌లు నిర్మించడానికి ప్రయత్నిస్తున్నాడు," అని కైఫ్ విశ్లేషించారు.

అనుభవం ఎందుకు ముఖ్యం?

2027 ప్రపంచ కప్ దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికగా జరగనుంది. అక్కడి పిచ్‌లు బౌన్సీగా ఉంటాయని, అటువంటి పరిస్థితుల్లో కొత్త కుర్రాళ్లు తడబడే అవకాశం ఉందని కైఫ్ హెచ్చరించారు. రోహిత్, కోహ్లీ వంటి అనుభవజ్ఞులు ఉంటేనే, క్లిష్ట పరిస్థితుల్లో జట్టును ఆదుకోగలరని ఆయన స్పష్టం చేశారు.

మొత్తానికి, సీనియర్ల అవసరం జట్టుకు ఇంకా ఉందని, వారిని పక్కనపెట్టి ప్రపంచ కప్ కలలు కనడం సరికాదని కైఫ్ తేల్చి చెప్పారు.




## నా వివాహం రద్దయిన మాట వాస్తవమే

భారత మహిళా క్రికెట్ జట్టులో స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన వివాహం రద్దయింది. ఈ విషయాన్ని స్మృతి మంధాన స్వయంగా తన ఇన్ స్టా ద్వారా వెల్లడించింది. ఈ విషయాన్ని ఇంతటితో వదిలేయాలంటూ అభిమానులు, మీడియాకు ఆమె విజ్ఞప్తి చేసింది. మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ తో కొంతకాలంగా డేటింగ్ లో ఉన్న స్మృతి మంధాన ఇటీవల పెళ్లిపీటలు ఎక్కేందుకు సిద్ధమైంది. ఈ నెల 23న వివాహానికి ముంబైలో ఏర్పాట్లు కూడా జరిగాయి. సంగీత్, మెహందీ వేడుకలు ఘనంగా జరగగా.. చివరి నిమిషంలో వివాహం ఆగిపోయింది. స్మృతి తండ్రి శ్రీనివాస్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరడంతో పెళ్లిని వాయిదా వేస్తున్నట్లు ఆమె మేనేజర్ ఓ ప్రకటన విడుదల చేశారు. అయితే, శ్రీనివాస్ మంధాన కోలుకుని ఆసుపత్రి నుంచి ఇంటికి చేరుకున్న తర్వాత కూడా వివాహానికి సంబంధించి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. దీంతో స్మృతి, పలాశ్ ల వివాహం రద్దయినట్లేనని ప్రచారం జరిగింది. ఎంగేజ్‌మెంట్ ప్రపోజల్, హల్దీ, మోహందీ వేడుకలకు సంబంధించిన వీడియోలు స్మృతి తన సోషల్ మీడియా ఖాతాల్లోంచి తొలగించడంతో ఈ ప్రచారానికి ఊతమిచ్చింది. అయితే, ఈ వార్తలపై ఇటు స్మృతి కానీ అటు పలాశ్ కానీ స్పందించలేదు. పలాశ్ కుటుంబం మాత్రం వివాహం జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేసింది. స్మృతి సందేశం చూస్తే .... 'నా వ్యక్తిగత జీవితాన్ని బయటి ప్రపంచానికి చూపించడానికి నేను ఇష్టపడను. అయితే, కొన్నిరోజులుగా నా జీవితంపై వదంతులు వస్తున్న క్రమంలో స్పందించాల్సి వస్తోంది. పలాశ్ తో నా వివాహం రద్దు అయింది. ఈ విషయాన్ని నేను ఇంతటితో వదిలేస్తున్నా. మీరూ వదిలేయండి. ఇరు కుటుంబాల ప్రైవసీని అందరూ గౌరవించాలని రిక్వెస్ట్ చేస్తున్నా. ఇక నా దృష్టంతా క్రికెట్ పైనే... జాతీయ జట్టుకు శక్తిమేర సేవలు అందిస్తాను' అంటూ స్మృతి తన పోస్టులో వివరించింది.



Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..